# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 10

బుధవారం, ఏప్రిల్ 03, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## ఎర్రబెల్లి, పల్లాకు కడియం శ్రీహరి స్ట్రాంగ్ కౌంటర్



**హన్మకొండ:** బీఆర్ఎస్ నేతలకు, బీజేపీకి కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి కౌంటరిచ్చారు. బీఆర్ఎస్ నేతలందరి చిట్టాలు తన వద్ద ఉన్నాయని అవి బయటపెడితే తట్టుకోలేరని వార్నింగ్ ఇచ్చారు. బీజేపీని అడ్డుకునే శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. కాగా, కడియం శ్రీహరి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ..'కాంగ్రెస్ పార్టీ మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. బీజేపీ.. సీబీఐ, ఈడీలను ప్రయోగించి నేతలను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తోంది. బీజేపీలో చేరితే పునీతులవుతారు.. కాంగ్రెస్‌లో చేరితే విమర్శలు చేస్తారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ నాలుగు వందల సీట్లలో గెలిస్తే వారు రాజ్యాంగాన్నే మార్చేస్తారు. రిజర్వేషన్లను ఎత్తేసే ప్రమాదం ఉంది. బీజేపీ అప్రజాస్వామిక - 2లో

# ఖమ్మంపై పీటముడి



### రాహుల్‌తో చర్చించాకే ఖరారయ్యే అవకాశం..
### అక్కడి అభ్యర్థిని బట్టి.. కరీంనగర్‌పై నిర్ణయం

### ఆ రెండింటితో పాటే హైదరాబాద్ అభ్యర్థి ప్రకటన

**కరీంనగర్ లోక్‌సభకు ప్రవీణ్‌రెడ్డి పేరును దాదాపు ఖరారు చేసినా ఖమ్మం పీటముడి వీడే వరకు ప్రకటించే అవకాశం లేదని తెలిసింది. ఖమ్మంలో ప్రసాద్‌రెడ్డి లేదా రఘురామిరెడ్డికి ఇస్తే కరీంనగర్ అభ్యర్థి ఎంపికపై మళ్లీ చర్చ జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ అభ్యర్థిని కూడా ఆ రెండు స్థానాలతో పాటే ప్రకటించవచ్చని భావిస్తున్నారు. ఈ నెల ఆరున తుక్కుగూడ బహిరంగసభలో పాల్గొనడానికి రాహుల్ గాంధీ రానున్నందున ఆ రోజు ఖమ్మం అభ్యర్థిత్వంపై ఆయనతో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.**


**హైదరాబాద్:** ఖమ్మం లోక్‌సభ సీటుకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయమై పీటముడి పడింది. ఇది తేలడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. పార్టీలో చేరే సమయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఇచ్చిన హామీ మేరకు ఆయన సోదరుడికి టికెట్ ఇవ్వాలని కొందరు, ప్రభుత్వంలో ముఖ్య స్థానాల్లో ఉన్న వారి కుటుంబ సభ్యులకు కాకుండా వేరొకరికి అవకాశమివ్వాలని మరికొందరు ప్రతిపాదిస్తున్న నేపథ్యంలో ఈ సీటుపై నిర్ణయం తీసుకోవడానికి మరో ఐదారు రోజులు పట్టవచ్చని తెలుస్తోంది. సోమవారం జరిగిన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశానికి రాహుల్ గాంధీ హాజరుకాకపో వడంతో ఆయనతో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకో నున్నారు. కరీంనగర్, హైదరాబాద్ లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల విషయమై దాదాపు నిర్ణయానికి వచ్చినా.. ఖమ్మం అభ్యర్థి ఎంపిక ప్రభావం కరీంనగర్ అభ్యర్థిపై పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు షమీర్ ఉల్లా పేరును ఖరారు చేసినట్లు సమాచారం. కరీంనగర్ స్థానానికి పలువురు పోటీ పడినా మొదటి నుంచీ రేసులో ఉన్న ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావుల పేర్లే తుది పరిశీలనకు వచ్చినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ సీటును పొన్నం ప్రభాకర్‌కు ఇచ్చినప్పుడు ప్రవీణ్‌రెడ్డికి ఎంపీగా పోటీకి అవకాశం ఇస్తామని పార్టీ హామీ ఇచ్చింది. ఈ మేరకు ఆయన పేరునే ఖరారు చేసినా, ఖమ్మం అభ్యర్థి ఎవరో తేలిన తర్వాత సామాజిక సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకొని కరీం నగర్ అభ్యర్థిని ఎంపిక చేస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

**ముఖ్యుల కుటుంబానికా? ఇతరులకా?**

ఖమ్మం లోక్‌సభ సీటుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుమారుడు యుగంధర్‌తో పాటు పారిశ్రామిక వేత్త రాజేంద్రప్రసాద్ తదితరులు పోటీపడ్డారు. ప్రభుత్వంలోని ముఖ్యుల కుటుంబ సభ్యులను మినహాయిస్తే బాగుంటుందనే చర్చ నేపథ్యంలో మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి కుమారుడు రఘురామిరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. మొదటి నుంచీ కాంగ్రెస్‌లో ఉండి రాజకీయంగా గుర్తింపు పొందిన కుటుంబం కావడంతో ఈయన పేరును ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు రాష్ట్రంలోని ముఖ్యనేత కూడా సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. పొంగులేటికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ గురించి సోమవారం నాటి సీఈసీ సమావేశంలో కమిటీ ఛైర్మన్ హరీష్ చౌధరి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పొంగులేటి పార్టీలో చేరే సమయంలో హామీ ఇచ్చిన మేరకు సీట్లు ఇవ్వలేకపోయామని, ఆయన రావడం వల్లే మరికొందరు కూడా పార్టీలో చేరారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. నందిని, ప్రసాదరెడ్డిల అభ్యర్థిత్వాల విషయమై కూలంకషంగా చర్చించినా.. రాహుల్‌గాంధీతో చర్చించిన తర్వాత ఖరారు చేయాలని నిర్ణయించారు. ముఖ్యనేతల కుటుంబ సభ్యులకు కాకుండా వేరే వారికి ఇవ్వాలనుకుంటే రఘురామిరెడ్డి పేరే ప్రధానంగా ఉండే అవకాశం ఉందని, మరో సామాజికవర్గానికి సీటు కేటాయించే అవకాశమూ లేకపోలేదని పార్టీ సీనియర్ నాయకుడొకరు తెలిపారు.

## ముక్కలు చేసి.. మూసీలో పడేసి!

### ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేసిన ప్రణీత్‌రావు
### అక్రమ ట్యాపింగ్‌లో అదనపు ఎస్పీల పాత్ర కీలకం
### న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లిన దర్యాప్తు అధికారులు
### జ్యుడీషియల్ రిమాండ్‌కు తిరుపతన్న, భుజంగరావు
### ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ వేణుగోపాల్‌కు నోటీసులు..?



**హైదరాబాద్:** ఎస్ఐబీలోని స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ద్వారా జరిగిన అక్రమ ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో అరెస్టు అయిన అదనపు ఎస్పీల విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్నలను ఐదు రోజులపాటు పోలీసు కస్టడీకి తీసుకున్న సిట్ అధికారులు వివిధ కోణాల్లో ప్రశ్నించారు. ఫలితంగా ట్యాపింగ్‌తో పాటు ఆధారాల ధ్వంసానికి సంబంధించిన సమాచారం సేకరించారు. ఈ వివరాలను పోలీసులు తమ రిమాండ్ రిపోర్టు ద్వారా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భుజంగరావు, తిరుపతన్నలు తమ నేరం అంగీకరించారని, ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాలతోనే నేరం చేసినట్టు బయటపెట్టారని కోర్టుకు సమర్పించిన

- మిగతా 2వ పేజీలో

## ఏ1 కేసీఆర్, ఏ2 హరీశ్‌రావు, ఏ3 వెంకట్రాంరెడ్డి, ఏ4గా కేటీఆర్ పేరు చేర్చాలి

### మీ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో స్టీఫెన్ రవీంద్ర చెప్పిన 30 కోట్లు ఎక్కడికి పోయాయి: రఘునందన్‌రావు



**హైదరాబాద్:** కేసీఆర్ సీఎం అయిన 2014 జూన్ 2 నుంచి జరిగిన ఫోన్ ట్యాపింగ్‌లపై విచారణ జరిపించి.. తప్పు చేసిన వారిని శిక్షించాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. తాను ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి సమాజం ఎదుట ఇన్ని ఆధారాలు పెట్టినా కూడా సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదో చెప్పాలని, అన్ని తెలిసి కూడా సీఎం సగం మాత్రం బయటపెట్టడం కూడా సరికాదన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. 2015లో జరిగిన ఓటుకు కోట్లు కేసులో జరిగిన రేవంత్‌రెడ్డి ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని పక్కన పెట్టి 2016 నుంచి జరిగిన ఫోన్ ట్యాపింగ్‌లపై విచారణ అని ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. మునుగోడు, దుబ్బాక ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రేవంత్‌రెడ్డి ఎందుకు ప్రస్తావిస్తున్నారని నిలదీశారు. రేవంత్‌రెడ్డి ఓటుకు కోట్ల కేసుపై కూడా విచారణ జరిపితేనే ప్రజలు నమ్ముతారని చెప్పారు. 2015లో

- మిగతా 2వ పేజీలో



## రేవంత్ బీజేపీలోకి వెళ్లడం పక్కా

### లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగేది అదే
### బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు
### మల్కాజ్‌గిరిలో బీజేపీతోనే బీఆర్ఎస్ పోటీ..
### కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థిని పెట్టిందని విమర్శ

**శామీర్‌పేట్:** సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం బీజేపీలోకి వెళ్లే మొట్టమొదటి వ్యక్తి రేవంత్‌రెడ్డే అని వ్యాఖ్యానించారు. అలియాబాద్‌లో మంగళవారం జరిగిన మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నరేంద్రమోదీని చౌకీదార్ చోర్ హై అని - 2వ పేజీలో

### వేల పుస్తకాలు చదివినా
## వానాకాలం ఎప్పుడొచ్చేదీ తెలియదా?

### బిడ్డ జైలుకు వెళ్లాక ఆయనకు ప్రజలు గుర్తుకొచ్చారు
### ఎన్నికల్లో లబ్ధి కోసమే మాజీ సీఎం వేషాలు..
### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, మహేశ్వరం:** తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడలో ఈ నెల 6న కాంగ్రెస్ నిర్వహించే జనజాతర సభా ప్రాంగణాన్ని సీఎం మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులున్నారు. ఈ సందర్భంగా సీఎం అక్కడే మీడియాతో మాట్లాడారు. 'ఈ నెల 6న తుక్కుగూడ సభలోనే జాతీయ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేస్తాం. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వంటి ముఖ్య నేతలంతా వస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది ఈ సభకు తరలి రావాలి. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆరు గ్యారంటీలను ఇదే తుక్కుగూడలో నిర్వహించిన సభలో ప్రకటించాం. వాటిలో ఐదింటిని ఇప్పటికే అమలు చేసి చూపించాం. 200 యూనిట్ల కరెంటు పథకాన్ని ఇప్పటికే 50 లక్షల మంది వినియోగించుకుంటున్నారు. మిగిలిన హామీలను ఎన్నికల కోడ్ ముగిశాక అమలు చేస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం. జూన్ 9న ఎర్రకోటపై జెండాను కాంగ్రెస్ ఎగరేస్తుంది. రాంలీలా మైదానంలో ప్రమాణ స్వీకారానికి అందరూ ఆహ్వానితులే' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**గత ఏడాది వానలు లేకనే కరవు:** 'కేసీఆర్ ఇప్పటికైనా పొలంబాట పట్టడం.. పదేళ్ల తర్వాతైనా రైతులు, వ్యవసాయం ఆయనకు గుర్తుకు రావడం సంతోషకరం. కేసీఆర్, ఆయన కుటుంబం చేసిన నిర్వాకాల వల్లే కవిత జైలుకు వెళ్లారు. ఆమె జైలుకు వెళ్లినందుకు సాటి మనుషులుగా మాకు కొంచెం సానుభూతి ఉంది. అధికారం

- మిగతా 2వ పేజీలో



## దానంను గెలిపించడమే మా బాధ్యత: కోమటిరెడ్డి

**హైదరాబాద్:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్ పార్టీదేనని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అని అన్నారు. ఇదే సమయంలో కేంద్రమంత్రిగా ఉండి సికింద్రాబాద్‌కు కిషన్ రెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు. సికింద్రాబాద్ ఎంపీగా దానం నాగేందర్‌ను గెలిపించడమే మా బాధ్యత అని వ్యాఖ్యలు చేశారు. కాగా, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం తుక్కుగూడలో కాంగ్రెస్ బహిరంగ సభ ఏర్పాటుపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ..'సభకు 10 లక్షల మందిని తరలిస్తాం. ఏప్రిల్ ఎనిమిదో తేదీన నాంపల్లిలో - 2వ పేజీలో

## ఆరు గ్యారంటీలు అమలు చేయకుంటే కాంగ్రెస్‌లో మిగిలేది ఆరుగురు ఎమ్మెల్యేలే


### హామీలు నెరవేర్చలేమని కేంద్రానికి సీఎం లేఖ రాస్తే నిధులు తెస్తాం.. రైతుదీక్షలో బండి సంజయ్

**తెలంగాణచౌక్(కరీంనగర్):** ఆరు గ్యారంటీలు అమలు చేయడం చేతకాదని, ఆదుకోవాలని కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాస్తే ప్రధాని మోదీని ఒప్పించి నిధులు తీసుకొచ్చే బాధ్యత తాము తీసుకుంటామని కరీంనగర్ ఎంపీ, భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. అన్నదాతల సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆయన రైతుదీక్ష చేపట్టారు. దీక్ష విరమణ అనంతరం విలేకరులతో మాట్లాడారు. "ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలన్న ఆలోచన - మిగతా 2వ పేజీలో



## 6న కాంగ్రెస్‌లోకి భద్రాచలం ఎమ్మెల్యే?

### తుక్కుగూడ సభలో రాహుల్ సమక్షంలో చేరే అవకాశం
### ఇల్లెందులో కాంగ్రెస్ సమావేశానికి హాజరైన తెల్లం వెంకట్రావు



**ఇల్లెందు:** భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆయన గత నెల 12న మణుగూరులో కాంగ్రెస్ ఆధ్వర్యాన జరిగిన సభకు సైతం హాజరయ్యారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన మహబూబాబాద్ లోక్‌సభ స్థాయి కాంగ్రెస్ సమావేశంలోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలసి వెంకట్రావు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమైనట్లు సమాచారం. ఈ నెల 6న తుక్కుగూడలో జరిగే సభలో రాహుల్ గాంధీ సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. దీనిపై వెంకట్రావును వివరణ కోరగా త్వరలో వివరాలు వెల్లడిస్తానని చెప్పారు.

**వ్యవస్థలను కేసీఆర్ నాశనం చేశారు: తుమ్మల**

ఇల్లెందు సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ దుర్వి నియోగం చేశారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా గత ఎన్నికల సందర్భంగా సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు

- మిగతా 2వ పేజీలో



## సైబర్ బాధితులకు అందుబాటులోకి మెరుగైన సేవలు

**సైబర్ వారియర్స్‌కు ఫోన్లు, సిమ్ కార్డులను అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఏప్రిల్2:** ఈ రోజు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజు సైబర్ నేరాల కట్టడికి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ నేరాల పట్ల ప్రత్యేక శిక్షణను పొంది సైబర్ వారియర్స్ గా నియమింపబడిన సిబ్బందికి ఫోన్లు మరియు సిమ్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్కు ఒక్కో సైబర్ వారియర్ చొప్పున 28 మందిని నియమించడం జరిగిందని తెలియజేశారు.సైబర్ వారియర్స్ గా శిక్షణ పొంది పోలీస్ స్టేషన్లో పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా ఒక ఫోన్ నెంబర్ ఉంటుందని తెలియజేసారు.సైబర్ నేరాల బారిన పడిన ప్రజలు వెంటనే 1930 కి కాల్ చేయడం గానీ, ఎన్ సి ఆర్ ఎఫ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడం గానీ చేయాలన్నారు. బాధితులు ఫిర్యాదులను నమోదు చేసుకుంటేనే గుర్తించడం సులువవుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకే సైబర్ వారియర్స్ ను పోలీస్ శాఖ తరపున ప్రతి పోలీస్ స్టేషన్లో నియమించడం జరిగిందని తెలిపారు.సైబర్ నేరాల బారిన పడిన ఫిర్యాదు చేసిన బాధితుడికి సంబంధిత పోలీస్ స్టేషన్లో నియమింపబడిన సైబర్ వారియర్ ద్వారా తమ అప్లికేషన్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని తెలియజేసారు. కావున జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైబర్ క్రైమ్స్ ఇన్చార్జి ఇన్స్పెక్టర్ జితేందర్,సైబర్ సెల్ సభ్యుడు శ్రావణ్ సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

## దానంను గెలిపించడమే మా బాధ్యత: కోమటిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో మరోసారి మీటింగ్ ఉంటుంది. బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం. భువనగిరి, నల్లగొండలో ఖచ్చితంగా గెలుస్తాం. సికింద్రాబాద్‌లో కూడా దానం నాగేందర్‌ను గెలిపిస్తాం. దానం గెలుపు బాధ్యత మాదే. తెలంగాణలో పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో లేకపోయినా ఈసారి గెలిచాం. బీఆర్ఎస్ పార్టీది కుటుంబ పాలన. మాజీ మంత్రి హరీష్‌రావు మాటలకు అర్థం లేదు. కేసీఆర్ చేసిన పాపాలకు వర్షాలు కూడా పడటం లేదు. కేసీఆర్ కేబుల్ బ్రిడ్జ్ వేసి హైదరాబాద్ అభివృద్ధి అంటున్నాడు. 40వేల కోట్లతో మూసి ప్రాజెక్ట్‌ను ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తాం. కేంద్రమంత్రిగా ఉండి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌ను పట్టించుకోలేదు. ఎలాంటి అభివృద్ధి చేయలేదు. కిషన్ రెడ్డి మతాల మధ్య గొడవలు పెట్టి గెలవాలని చూస్తున్నాడు. అది సాధ్యం కాదు. కాంగ్రెస్ కచ్చితంగా 14 సీట్లు గెలుస్తుంది' అని కామెంట్స్ చేశారు. ఇక, దానం నాగేందర్ మాట్లాడుతూ..'సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి కోమటిరెడ్డి ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను. రాబోయే ఎన్నికల్లో నేను గెలవడానికి అందరి సహకారం కావాలి. తుక్కుగూడ సభ విజయవంతం చేయడానికి సమావేశమయ్యాం' అని వ్యాఖ్యలు చేశారు.

## ముక్కలు చేసి.. మూసీలో పడేసి!

(మొదటి పేజీ తరువాయి)

రిమాండ్ రిపోర్టులో పొందుపరిచారు. మంగళవారం వీరిద్దరిని గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి శనివారం వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, చంచల్‌గూడ జైలుకు తరలించారు.

**ప్రణీత్‌రావు దారికి వచ్చాడంటూ...:** ఈ కేసులో తొలి అరెస్టు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుదే. తొలుత పోలీసు విచారణకు అతడు సహకరించలేదని, అయితే రానురాను సహకరిస్తూ కీలక వివరాలు వెల్లడించారని పోలీసులు కోర్టుకు తెలిపారు. ప్రభాకర్‌రావు రాజీనామా చేసిన రోజే (గత ఏడాది డిసెంబర్ 4న) ఆయన ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న టీఎస్ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్ కైతోజు కృష్ణతో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లారు. అక్కడ తాను ఏర్పాటు చేసుకున్న వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలు ఆఫ్ చేయించాడు. వార్‌రూమ్‌లోని 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్ లను ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. తనతో వచ్చిన ఎలక్ట్రీషియన్‌తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్కు ముక్కలు చేశాడు. వీటి శకలాలను నాగోలు వద్ద మూసీనదిలో పారేశాడు. ఈ విషయాలు వెలుగులోకి రావడంతోనే అప్రమత్తమైన సిట్ అధికారులు మూసీలో సోదాలు చేశారు. వీరికి ధ్వంసమైన హార్డ్‌డిస్క్ కేసులు 5, హార్డ్‌డిస్క్ ముక్కలు తొమ్మిది లభించాయి. వీటితో పాటు తాము మూసీ నుంచే ఆరు మెటల్ హార్డ్‌డిస్క్ ముక్కల్నీ సీజ్ చేశామని కోర్టుకు తెలిపారు.

**ఎస్ఐబీ కార్యాలయం నుంచి ఆధారాలు:** ప్రణీత్‌రావు వాంగ్మూలం ఆధారంగా సిట్ అధికారులు మూసీనది నుంచే కాకుండా గ్రీన్‌లాండ్స్‌లోని ఎస్ఐబీ కార్యాలయం, దాని ఆవరణ, పరిసరాల నుంచి కొన్ని ఆధారాలు, భౌతిక సాక్ష్యాలు సేకరించారు. అక్రమ ట్యాపింగ్‌కు వినియోగించిన 12 కంప్యూటర్లు, 7 సీపీయూలు, ల్యాప్‌టాప్, మానిటర్లు, పవర్ కేబుళ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న ఎలక్ట్రీషియన్ గదిలో క్లూస్, ఫోరెన్సిక్ అధికారులతో కలిసి సోదాలు చేసిన సిట్ హార్డ్‌డిస్కు కట్ చేస్తున్నప్పుడు కింద పడి, మూలలకు చేరిన వాటి పొడిని సీజ్ చేశారు. ఎస్ఐబీ కార్యాలయ ఆవరణలో పాక్షికంగా కాలిన డాక్యుమెంట్లు, స్పైరల్ బైండింగ్ చేసిన పత్రాలతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీకి సంబంధించిన లాగ్‌బుక్ ప్రతులను పోలీసులు సేకరించారు. ఎస్ఐబీ కానిస్టేబుల్ కొత్త నరేష్ గౌడ్ నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రతిపక్షాలపై తాము నిఘా పెట్టినట్టు అతడు బయటపెట్టాడు. ప్రధానంగా ప్రైవేట్ వ్యక్తులపై అక్రమ నిఘా ఉంచడంలో భుజంగరావు, తిరుపతన్న కీలకంగా వ్యవహరించారని, ఈ విషయాన్ని వారు అంగీకరించారని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు.

## ఎర్రబెల్లి, పల్లాకు కడియం స్ట్రాంగ్ కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

పద్ధతులను అడ్డుకోవాల్సి అవసరముంది. బీజేపీని అడ్డుకునే శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉంది. ఎన్నికల్లో నన్ను గెలిపించిన విధంగానే, కావ్యను కూడా గెలిపించాలని కోరుతున్నాను. బీఆర్ఎస్‌ను వీడటం కొంత బాధగానే ఉంది. కేసీఆర్‌పై నాకు గౌరవం ఉంది. ప్రత్యేకంగా కేసీఆర్‌పై నేను ఎలాంటి విమర్శలు చేయదలుచుకోలేదు. చాలా మంది పార్టీలు మారుతున్నారు. పార్టీలు మారినా ఎవరిపై పార్టీ నేతలు స్పందించలేదు. కానీ, నాపై మాత్రం బీఆర్ఎస్ నేతలు తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. కానీ, వారు మాట్లాడే పద్ధతి బాగోలేదు. జిల్లా స్థాయి నేతలు కూడా నాపై అనవసర కామెంట్స్ చేయడం కరెక్ట్ కాదు. ఎర్రబెల్లి దయాకర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదు. నిన్ను పాలకుర్తి ప్రజలే చీకొట్టారు. ఇలాంటి అహంకార మాటల వల్లే ఓడిపోయావు. ఇప్పటికైనా ఇలాంటి మాటలు తగ్గించుకుంటే మంచిది. బీఆర్ఎస్ ఇలాంటి దుస్థితికి రావడానికి కారణం పల్లా రాజేశ్వర్ రెడ్డి వంటి నేతలే కారణం.

# జోరుగా ఇటుక బట్టీల దందా

**విద్యుత్ చౌర్యం చేస్తున్న బట్టి దారులు.. కార్మిక శాఖ అనుమతులు ఎక్కడ...?**





**భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే:** లక్ష్మీదేవిపల్లి మండలంలోని అనిశెట్టిపల్లి, కారుకొండ, లోతు వాగు, హేమచంద్రపురం, జూబ్లీపురం గ్రామాలలో ఇటుక బట్టీల దందా జోరుగా కొనసాగుతుంది. 1/70 చట్టం అమలులో ఉన్నప్పటికీ ఇటుక బట్టి యజమానులు చట్టాలను తుంగలో తొక్కి బట్టీల వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. ఈ బట్టీల వలన ప్రశాంతంగా ఉన్న పల్లె వాతావరణం కలుషితం అవుతుంది. ఇటుకలను తయారుచేసిన తర్వాత వాటిని కాల్చుటకు ఉపయోగించే కలపను దగ్గరలో ఉన్న అడవుల నుండి సమకూర్చుకుంటున్నారు. అటవీ శాఖ అధికారులు బట్టిదారులకు మిళితమై చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇటుక తయారీ కూలీలను ఇతర రాష్ట్రాల నుండి తీసుకువస్తున్నారు. సంబంధిత కార్మిక శాఖ అధికారుల నుండి ఎటువంటి అనుమతులు సైతం తీసుకోవడం లేదు.వీరు ఇటుకలు తయారు చేసే ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సైతం అడ్డాలుగా మార్చుకొని బట్టీలకు ఉపయోగించే కలపను ఆ పాఠశాలల ఎదుటే నిల్వ చేస్తున్నారు. గత కొన్ని ఏళ్ల నుండి సాగుతున్న ఈ దందాను అడ్డుకునే అధికారులే లేకపోవడం గమనార్హం. బట్టీల వద్ద వినియోగించే విద్యుత్తును సైతం చౌర్యం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటివరకు బట్టి దారులు వినియోగించే విద్యుత్ కు జరిమాణాలు సైతం విధించకపోవడం వెనుక ఆంతర్యమేమిటి. సారవంతమైన వ్యవసాయ భూములను ఇటుక బట్టీలకు వినియోగించడం వలన పంటలు సైతం పండక ఎంతోమంది రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శాఖా పరమైన చర్యలు తీసుకొని అడ్డగోలుగా వెలుస్తున్న ఇటుక బట్టీలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.





## వానాకాలం ఎప్పుడొచ్చేదీ తెలియదా?

(మొదటి పేజీ తరువాయి)

పోయి.. బిడ్డ జైలుకు వెళ్లాక కేసీఆర్‌కు ప్రజలు గుర్తుకొచ్చారు. వేల పుస్తకాలు చదివిన ఆయనకు వానాకాలం ఎప్పుడొస్తుందో తెలియదా? గత వర్షాకాలంలో అధికారంలో ఉన్నది కేసీఆర్ ప్రభుత్వమే. ఆయన చేసిన పాపాల ఫలితంగానే గత ఏడాది వానలు పడలేదు. అందుకే ఇప్పుడు కరవు వచ్చింది.

**64 లక్షల మందికి రైతుబంధు ఇచ్చాం:** 2018 ఎన్నికలకు ముందు మినహా కేసీఆర్ ప్రభుత్వం ఏ సీజన్‌లోనూ రైతుబంధు నిధుల పంపిణీ 10 రోజుల్లో పూర్తి చేయలేదు. ప్రతి సీజన్‌లోనూ నాలుగైదు నెలల సమయం తీసుకుంది. మా ప్రభుత్వం 64,75,581 మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు సొమ్మును ఇప్పటికే జమ చేసింది. ఎన్నికల కోడ్ ముగియగానే మిగిలిన 4 లక్షల ఖాతాలకు జమ చేస్తాం. మేం చెప్పిన లెక్కలు తప్పయితే.. ఏ శిక్షకైనా సిద్ధం. అవి వాస్తవమని నిరూపిస్తే.. రైతులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. అసెంబ్లీలోనే రైతుబంధు లెక్కలు బయటపెడదామంటే ఆయన సభకు రాలేదు. ఇటీవల కేసీఆర్ పర్యటించిన రోజున సూర్యాపేటలో 30 సెకన్లు కూడా కరెంటు పోలేదు. ఆయన సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతున్న పుడు మైక్ జనరేటర్‌కు కనెక్ట్ అయి ఉంది. మీ జనరేటర్‌లో ఎవరు పుల్ల పెట్టారో ఎవరికి తెలుసు? భారాస పార్టీ ఖాతాలో రూ.1500 కోట్లు ఉన్నాయి. ఆ సొమ్ము నుంచి రూ.100 కోట్లు రైతులకు ఇచ్చి ఉంటే కేసీఆర్ చేసిన పాపం కొంతయినా తగ్గేది. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఆయన వేషాలు వేస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే.. ప్రతి వారం ప్రజల్లోకి వెళ్లాలి. ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యత నెరవేర్చాలి.

**రైతు ఆత్మహత్యల వివరాలివ్వగలరా?:** రేవంత్‌రెడ్డి ఎక్కడ నిద్రపోతు న్నారని కేసీఆర్ అంటున్నారు. నేను ఫాంహౌస్‌లోనో.. సినిమా వాళ్ల గెస్ట్‌హౌసుల్లోనో పడుకోవడంలేదని కేసీఆర్ గ్రహించాలి. కేసీఆర్, కేటీఆర్‌లు వాళ్ల బాస్ మోదీ గెలవాలని.. కాంగ్రెస్‌కు దేశంలో 40 సీట్లే రావాలని కోరుకుంటున్నారు. కేసీఆర్‌కు 48 గంటల సమయం ఇస్తున్నా... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 200 మంది రైతులు చనిపోయారని ఆరోపిస్తున్న మీరు ఆ వివరాలు ప్రభుత్వానికి ఇవ్వగలరా? నిజంగా రైతులు చనిపోయి ఉంటే వారిని ఆదుకునే బాధ్యత మాది.

**మేడిగడ్డ నీరు వదిలింది భారాస హయాంలోనే..:** కాళేశ్వరం ప్రాజెక్టుకు వెన్నెముక లాంటి మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోయాయి. భారాస అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ నుంచి నీరు వదిలేశారు. అది మరిచి ఇప్పుడు కేసీఆర్ మాపై నెపం నెడుతున్నారు. అన్నారం కట్ట పాడైందని.. దాని నుంచి నీరు బయటికి వదిలాం. డ్యాం సేఫ్టీ అధికారులే నీరు నిల్వ చేయవద్దని చెబుతున్నారు. మిషన్ భగీరథ ద్వారా కృష్ణా జలాలను ఇవ్వాల్సినదానికన్నా ఎక్కువగా ఇచ్చాం. వెయ్యి ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయిస్తున్నాం. సాగర్‌లో నీటిమట్టాలు డెడ్‌స్టోరేజీకి పడిపోయాయి. తాగునీటికే మొదటి ప్రాధాన్యం. బోర్లు ఎండిపోయినందున ఇంటి అవసరాలకు ట్యాంకర్ల ద్వారా కూడా నీరందిస్తున్నాం. రైతుల బోర్లను తీసుకుని ఊర్లలో ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నాం.

**మీ తప్పుల్ని సరిచేయడానికి కష్టపడుతున్నాం**

రూ. 7 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని మాకు అప్పజెప్పారు. మీరు చేసిన తప్పుల్ని సరిదిద్దడానికి మేం రోజుకు 18 గంటలు కష్టపడుతున్నాం. మేం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తుంటే.. ఈ ప్రభుత్వం కూలాలి, పోవాలంటూ శాపనార్థాలు పెట్టడమేంటి కేసీఆర్? వరికోతలు ఇంకా పూర్తిస్థాయిలో మొదలే కాలేదు. క్వింటా ధాన్యానికి 10 కిలోల కమీషన్ కొట్టే విధానం మాకు లేదు. దిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేంద్రం నుంచి పెండింగు ప్రాజెక్టులు సాధించుకొచ్చాం. ఈ ఎన్నికల్లో భారాస ఎంపీ అభ్యర్థులు పారిపోతుంటే వారిని ఆపడానికి కేసీఆర్ టక్కు టమార విద్యలన్నీ ప్రదర్శిస్తున్నారు. భారాసకు ఓటేస్తే మోదీకి ఓటేసినట్టే అవుతుంది' అని రేవంత్ దుయ్యబట్టారు.

## ఏ1 కేసీఆర్, ఏ2 హరీశ్‌రావు, ఏ3 వెంకట్రాంరెడ్డి, ఏ4గా కేటీఆర్ పేరు చేర్చాలి

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన తన టెలిఫోన్ ట్యాపింగ్ ఎందుకు పక్కకు పెడుతు న్నారో సీఎం సమాధానం చెప్పాలన్నారు. 'రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేసి నప్పుడు అప్పటి డీజీపీ అనురాగ్‌శర్మ, సిటీ పోలీస్ కమి షనర్ ప్రస్తుత టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి. ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, ఎస్ఐబీలో ఉన్నది ప్రస్తుత ఆర్టీసీ చైర్మన్ సజ్జనార్... రేవంత్‌రెడ్డి ఇవ్వన్ని ఎందుకు దాచిపెడుతున్నారో సమాధానం చెప్పాలి'అని డిమాండ్ చేశారు. ప్రస్తుతం బయటపడిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో అప్పటి సీఎం, అప్పటి డీజీపీలను ఎందుకు ముద్దాయిలుగా చేర్చడం లేదని ప్రశ్నించారు. నిజంగానే కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య ఒప్పందం లేకపోతే మాజీ సీఎం కేసీఆర్ పేరును ఎందుకు ఇందులో చేర్చడం లేదని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌లో మొదటి ముద్దాయిగా కేసీఆర్, ఆ తర్వాత హరీశ్‌రావు, వెంకట్రాంరెడ్డి, కేటీఆర్, నవీన్‌రావు, సందీప్‌రావుల పేర్లు వరుసగా చేర్చాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అవగాహనతోనే విచారణ:** ప్రస్తుతం ఈ కేసు విచారణ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య కుదిరిన అవగాహనతోనే జరుగుతోందని రఘునందన్‌రావు ఆరోపించారు. మునుగోడు ఉపఎన్నికలో రూ.3.5 కోట్లు పట్టుకున్నా, ఇప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదు? ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడే అయినా ఎందుకు ఫిర్యాదు చేయడం లేదు అని ప్రశ్నించారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్ర చెప్పిన రూ.30 కోట్లు ఎక్కడకు పోయాయని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తాను ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసు ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలన్నీ పరిశీలిస్తే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో సెలెక్టివ్ విచారణ జరుగుతున్నదనే అనుమానం కలుగుతోందన్నారు. 'దుబ్బాక ఉపఎన్నిక సమయంలో నా ఫోన్ ట్యాప్ జరిగిందని డీజీపీకి చెప్పాను. అప్పటి జిల్లా కలెక్టర్, ప్రస్తుత మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావును ముద్దాయిగా చేయాలని చెప్పిన. ఎందుకు చేర్చుతలేరో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి'అని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బంగారు దుకాణాల ఓనర్లను బెదిరించి వాళ్ల దగ్గర తెచ్చిన బంగారంతో యాదగిరి టెంపుల్ కట్టారా అని ప్రశ్నించారు.

### రఘునందన్‌రావుపై కేసు నమోదు

**సంగారెడ్డి:** మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన, అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రెండు రోజుల క్రితం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## 6న కాంగ్రెస్‌లోకి భద్రాచలం ఎమ్మెల్యే?

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేసి తీరతామని, గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు కొనసాగిస్తూ కొత్తవి కూడా అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 7,145 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ప్రతి గింజనూ కొంటామన్నారు. ఇప్పటికే 92.36 శాతం రైతుబంధు పంపిణీ పూర్తి చేశామని, పంటల బీమా పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పారు.

## రేవంత్ బీజేపీలోకి వెళ్లడం పక్కా

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ అంటుంటే రేవంత్ మాత్రం మోదీ హమారా బడే భాయి (పెద్దన్న) అంటున్నారని గుర్తు చేశారు. అసలు సీఎం రేవంత్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కోసం పని చేస్తున్నాడా లేక నరేంద్ర మోదీ కోసం పనిచేస్తున్నాడా అనే సందేహం కలుగుతోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. లిక్కర్‌స్కాంలో కేజ్రీవాల్ అరెస్ట్ అన్యాయ మని అంటున్న రేవంత్ కవిత అరెస్టు కరెక్ట్ అని ఎలా అంటారని నిలదీశారు. మందికి పుట్టిన బిడ్డ లని తమ బిడ్డలని చెప్పుకోవడమే సీఎం తత్వమని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని తాను చేశానని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడితే పేగులు మెడలో వేసుకుంటా అని రేవంత్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని, ఆయన పక్కనే ఉన్న నల్లగొండ, ఖమ్మం మానవ బాంబులతో జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్ సూచించారు. ఆ తర్వాతే ఈటల ఓట్లడగాలి మల్కాజ్‌గిరిలో బీజేపీతోనే బీఆర్ఎస్‌కు పోటీ అని, కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని పెట్టిందని కేటీఆర్ అన్నారు.

## కాంగ్రెస్‌లో మిగిలేది ఆరుగురు ఎమ్మెల్యేలే

భాజపాకు లేదు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే భారాసకు పట్టిన గతే కాంగ్రెస్‌కూ పడుతుంది. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామంటూ కాంగ్రెస్ మోసం చేసింది. అమలు చేయకపోయినా రూ.600 కోట్లతో అమలు చేసినట్లు మీడియాలో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ఆ పార్టీలో మిగిలేది ఆరుగురు ఎమ్మెల్యేలే.

**పార్టీ గేట్లు కాదు.. ప్రాజెక్టుల గేట్లు ఎత్తండి**

ప్రజలు, రైతుల పక్షాన కొట్లాడటం, దీక్షలు, ధర్నాలు చేయడం.. మాకు కొత్త కాదు. గత భారాస ప్రభుత్వం రైతులు సహా అన్ని వర్గాలకు చేసిన ద్రోహంపై అనేక రూపాల్లో కొట్లాడింది భాజపానే. సకాలంలో సాగునీరు వదలకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పార్టీలో చేరికలకు గేట్లు ఎత్తడం కాదు.. సాగునీటి ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీళ్లివ్వాలి. పట్టణాల్లో తాగునీటి కొరత ప్రారంభమైనా పట్టించుకోరా? పంటలు ఎండిపోయిన, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారమివ్వాలి. వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ముందే కనీస మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి. రైతు భరోసా కింద రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు ఇస్తామన్న హామీ ఏమైంది?

# పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

## పీ.ఓ, ఏ.పీ.ఓల శిక్షణ తరగతుల్లో కలెక్టర్



**రంగారెడ్డి జిల్లా/ఇబ్రహీంపట్నం ఏప్రిల్2(వాయిస్ టుడే):** పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి మే13న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లచే నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు బాలాపూర్ మండలం గుర్రంగూడలోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫెలిసిటేషన్ సెంటర్లు, పీ.ఓలు, ఏ.పీ.ఓలకు అందిస్తున్న హ్యాండ్ బుక్, శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. పీ.ఓలు, ఏ.పీ.ఓలను ఉద్దేశించి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా సద్వినియోగం చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహనను చేసుకోవాలని, ఇదివరకు ఎన్నికల విధులు నిర్వర్తించిన వారు సైతం ట్రైనింగ్ క్లాసులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల గురించి తెలుసుకోవాలని సూచించారు. పోలింగ్ డే సంద ర్భంగా పి.ఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి క్లుప్తంగా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొర పాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాల న్నారు. కొందరు పి.ఓలు శిక్షణకు రాకుండా అంతా తమకు తెలిసిందేనని అతి విశ్వాసంతో తప్పులు చేస్తారని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు ఈ.వి.ఎం లు తీసుకొని పోలింగ్ డే పూర్తయిన తర్వాత సాయంత్రం కాగానే తిరిగి ఇవ్వవలసిన బాధ్యత పి.ఓలేదనని అన్నారు. పొలిటికల్ ఏజెంట్స్ పి.ఓలను ప్రశ్నించే వాటికి సమాధానం చెప్పాల్సింది పి.ఓలదే పూర్తి బాధ్యత అని సూచించారు. పోలింగ్ డే రోజున పోల్ తర్వాత రిపోర్ట్ తయారు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట మహేశ్వరం ఎఆర్ఓ ఆర్డీఓ సురజ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఆదిభట్ల భూ కబ్జా కేసులో ప్రధాన నిందితుడు కన్నారావు రిమాండ్‌కు తరలింపు



పక్కా సమాచారంతో బాలాపూర్‌లో అరెస్ట్
ఇదివరకే 8మంది నిందితుల అరెస్టు రిమాండ్
గత నెల మూడో తారీఖున కేసు నమోదు
పరారీలో మరో ఆరు మంది నిందితులు

**ఇబ్రహీంపట్నం: ఏప్రిల్2(వాయిస్ టుడే):** మన్నెగూడలో భూ కబ్జాకు పాల్పడ్డ కేసులో ప్రధాన నిందితుడు, కల్వకుంట్ల తేజేశ్వరరావు అలియాస్ కన్నారావును, మంగళవారం ఎట్టకేలకు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన పోలీసులు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నెగూడలో సర్వే నెంబర్ 32/రు గల భూమిని, కల్వకుంట్ల కన్నారావు అతని అనుచరులు అక్రమంగా కబ్జా చేశారని, గత నెల మూడవ తేదీన, ఓఎస్ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసు ఫిర్యాదు మేరకు ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో, కల్వకుంట్ల తేజేశ్వర్ రావు అలియాస్ కన్నారావుపై, మరో22 మంది పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితులైన ఐదుగురిలో ఒకరైనా ా4గా ఉన్నా కన్నారావు పరారీలో ఉండగా, బాలాపూర్ లో అడ్వకేట్ ను కలవడానికి వచ్చిన ఆయనను, పక్కా సమాచారం మేరకు బాలాపూర్ లో అరెస్ట్ చేసి, లుకౌట్ నోటీసులు జారీ చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందని, కోర్టులో హాజరు పరిచి అతన్ని రిమాండ్ కు తరలించామని సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. హైకోర్ట్ లో కన్నారావు రెండుసార్ల ముందస్తు బెయిలు కోసం ప్రయత్నం చేయగా, పిటిషన్ ను హైకోర్టు తిరస్కరించిందని తెలిపారు. ఇదివరకే ఎనిమిది మంది నిందితులు ముందస్తు బెయిల్ తెచ్చుకోగా, మరో ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన సంగతి విధితమే. అయితే ఏడు మంది నిందితులు పరారీలో ఉండగా, మంగళవారం కన్నారావును అరెస్టు చేయగా, మరో ఆరు మంది నిందితులు పరారీలు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో భూ కబ్జాలకు ఎవ్వరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ హెచ్చరించారు.

# అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన MDR ఫౌండేషన్

**సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు, వాయిస్ టుడే న్యూస్:** పటాన్ చెరు పట్టణంలో సమాజ సేవ పట్ల నిత్యం తమదైన శైలిలో నిర్వహిస్తున్నటువంటి MDR ఫౌండేషన్ ఈరోజు ఇంకో అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. పటాన్చెరువు మండలంలోని ముత్తంగి గ్రామం స్వీట్ హార్ట్ హోటల్ వెనకాల ఉన్నటువంటి నిర్మాణ నిర్మానుష్యప్రదేశంలో సుమారు 60 నుంచి 65 సంవత్సరాలు ఉన్నటువంటి వ్యక్తి చెట్లపొదలలో పడి ఉన్నాడు అని సమాచారం తెలిసినటువంటి పోలీసులు, అతని గురించి విచారించగా, అతనికి సంబంధించిన వివరాలు ఏమీ తెలియకపోవడంతో, MDR ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతక్రియలు నిర్వహించారు.


# టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రావణ్ కుమార్‌రెడ్డి కలిసిన కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్



**సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు, వాయిస్ టుడే న్యూస్:** టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి ని కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి గారిని కలిసి మద్దతు కోరారు. ఎన్నికలవేళ తనకు అండగా నిలువాలని కోరారు. తన విజయానికి తమ వంతుగా తోడ్పాటును అందించాల న్నారు. తనకు ఎంపీగా అరుదైన అవకాశాన్నిచ్చిన కాంగ్రెస్ అధిష్టానానికి, తనకు సహకరించిన పెద్దలకు రుణపడి ఉంటానని నీలం మధు ఈ సందర్భంగా పేర్కొన్నారు.తన సంపూర్ణ మద్దత్తు ఉంటుంది అని డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి తెలిపారు, ఈ కార్యక్రమంలో intuc సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నరసింహరెడ్డి, మెదక్ intuc ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ దుబ్బాక ఎంపీటీసీ సంజీవరెడ్డి, కౌన్సిలర్ కొల్లూర్ మల్లేష్, నారాయణ రెడ్డి, తిరుమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కరువుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవాలి

జిల్లా ప్రజలకు పథకాలను సకాలంలో అందించాలి
కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి
జిల్లా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్2(వాయిస్ టుడే):** కరువుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రంగారెడ్డి జిల్లా జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్సీ సురభివాణీదేవి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి. మాజీ మంత్రి మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాలు అట్టడుగుకు చేరుకున్న కారణంగా రైతులకు సాగునీరు లేక కరువుతో అల్లాడుతున్నారని గుర్తు చేశారు. జిల్లాలో సాగునీరు, తాగునీరుకు ఆటంకాలు ఎదురవుతున్నాయని జిల్లా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రజలకు మాయమాటలు, మోసపూరిత మాటలు చెప్పకుండా ప్రజలకు చెందాల్సిన పథకాలను సకాలంలో అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాష్ గౌడ్, అరికెపూడి గాంధీ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపిపి కృపేష్, సింగిల్ విండో చైర్మెన్ మహేందర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్పల్లిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

## విగ్రహానికి పూలమాలలు వేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆనంద్ బాబు



**కంటోన్మెంట్, ఏప్రిల్ 2 (వాయిస్ టుడే ప్రతినిధి):** న్యూ బోయిన్పల్లిలో 314వ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని బోయిన్పల్లి గౌడ సంఘం నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆనంద్ బాబు హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు ఈ సందర్భంగా ఆనంద్ బాబు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొడితే గోల్కొండ కిల్లాకు రాజు కావాలనే బహుజన సైన్యం తయారు చేసి తొలి స్వాతంత్ర సమరయోధుడిగా తొలి బహుజన చక్రవర్తిగా 18 కోట్లకు రాజుగా చేసినాడు ఇతని ఆదర్శంగా తీసుకొని బహుజనులందరూ ఏకమై రాజాధికారం కోసం పోరాడాలని అన్నారు ఈ కార్యక్రమంలో బోయిన్పల్లి గౌడ సంఘం నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్కాజ్ గిరి పార్లమెంట్ ప్రజలకు అందుబాటులో ఉంటా: రాగిడి లక్ష్మారెడ్డి

## ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు కావాలంటే బిఆర్ఎస్‌కు ఓటు వేయాలి



**కంటోన్మెంట్ ఏప్రిల్ 2 (వాయిస్ టుడే ప్రతినిధి):** మల్కాజ్‌గిరి పార్లమెంటు ప్రజలకు అందుబాటులో ఉండే బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డినీ భారీ మెజారిటీతో గెలిపించాలని, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశన్ని స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అధ్యక్షతన జరిగింది. మల్కాజిగిరి పార్లమెంటులో బీఆర్ఎస్ గెలుపు అవశ్యకతను కార్యకర్తలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మల్కాజ్ గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి వివరించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.... అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం పోరాటం చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రకటించారు. పార్లమెంటులో రాగిడి లక్ష్మా రెడ్డి, అసెంబ్లీలో తాను కొట్లాడుతామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... మల్కాజిగిరి పార్లమెంటు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. మల్కాజిగిరి పార్లమెంటు అభివృద్ధి జరుగాలంటే తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే మల్కాజిగిరి ప్రజలను గాలికి వదిలేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నరేందర్ గౌడ్, కర్రె జంగయ్య, కర్రే లావణ్య, బల్వంత్ రెడ్డి, మక్కల నర్సింగ్ రావు, మన్నే ఉదయ్ యాదవ్, సయ్యద్ ఇజాజ్ బాయ్, గడ్డం నర్సింగ్ రావు, ఇర్ఫాన్ బాయ్, రాజేశ్వరి, మేకల హరినాథ్, రాజు యాదవ్, చందు యాదవ్, బుర్రి యాదగిరి, మట్టి శ్రీనివాస్, రాజు గౌడ్, చారి, బాలరాజ్, నాతరి కుమార్, లలిత, సంతోషి, అనురాధ, శశికళ, రోజా, ఉమ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తెలంగాణ ఉద్యమకారులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గణితంపై పట్టు - విజయానికి తొలి మెట్టు

## పాఠశాల విద్యార్థులకు గణితం, సెన్స్ ప్రాముఖ్యతలను వివరించిన గీతం విద్యార్థులు



**సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు వాయిస్ టుడే:** వ్యక్తుల విశ్లేషణాత్మక సామర్థ్యాలను రూపొందించడంలో, పోటీ పరీక్షలను వారిని సిద్ధం చేయడంలో గణిత శాస్త్రం క్రియాశీలక భూమిక పోషిస్తోందని, గణితంపై పట్టు విజయానికి తొలి మెట్టుగా గీతం విద్యార్థులు అభివర్ణించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ విద్యార్థులు మంగళవారం రుద్రారంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం, సైన్స్ ప్రాముఖ్యతను వివరించడానికి ఉద్దేశించిన ఔట్రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు గీతం విద్యార్థులు పాల్గొని, గణితం, సైన్సునె ప్రేమను పెంపొందించడంతో పాటు చొరవను కొనసాగించాల్సిన ఆవశ్యకతను కార్యక్రమ సమన్వయకర్త, గణిత శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాశం నరసింహస్వామి మాట్లాడుతూ, వివిధ రంగాలలో విజయానికి అవసరమైన నిమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలను పెంపొందించడంలో గణిత శాస్త్రం: పాత్రను నొక్కి చెప్పారు. తమ ఈ ప్రయత్నానికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారం అవసరమని డాక్టర్. స్వామి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రుద్రారం ఉన్నత పాఠశాలకు చెందిన 120 నుంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రణవి, షాజియా, చందన, కార్తీక ల నేతృత్వంలో సుమారు ఇరవై మంది గీతం విద్యార్థులు ఈ కార్యక్రమం సఫలం కావడానికి కృషి చేశారు.

# ప్రాంతాలకు, మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ రంజాన్



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్2(వాయిస్ టుడే):** రంజాన్ పవిత్ర పర్వదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు, రంజాన్ ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి ముస్లిం సోదరులకు ఆతిథ్యం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం సోదరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భువనగిరి ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా గెలుపు ఖాయం

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సంపూర్ణ మద్దతు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్2(వాయిస్ టుడే):** భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానం చామల కిరణ్ కుమార్ రెడ్డిని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని, తొర్రూరు క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిత్వంలో ఎమ్మెల్యే సంపూర్ణ మద్దతు తెలియచేసి అండగా నిలిచినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి భారీ మెజారిటీతో గెలిపిస్తామని, భువనగిరి ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ఎమ్మెల్యే రంగారెడ్డి ఘంటాస్పదంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అన్నపై దాడి చేసిన తమ్ముడు పై కేసు నమోదు

**చందుర్తి వాయిస్ టుడే ప్రతినిధి ఏప్రిల్ 2:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో అన్నపై దాడి చేసిన తమ్ముడు పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.వివరాల ప్రకారం రామన్నపేటకు చెందిన గుండుజు రాజేశం, గుండుజు శ్రీనివాస్ ఇద్దరు అన్నదమ్ములు. ఇంటి స్థలం వద్ద గొడవ పడగ శ్రీనివాస్ (తమ్ముడు), రాజేశం(అన్న) పై దాడి చేసి గాయపరిచాడు. రాజేష్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి శ్రీనివాస్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

# జర్నలిస్టులపై దాడిని ఖండిస్తున్నాం బండి రమేష్



**కూకట్ పల్లిబీఏప్రిల్ 2(వాయిస్ టుడే):** ఉప్పల్ ప్రెస్ క్లబ్ లో మీడియా ప్రతినిధులపై దాడిని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఖండించారు. సోమవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో మల్కాజ్గిరి పార్లమెంటు నియోజవర్గ బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ బాధితులు తిప్పారపు సంపత్ తన గోడు వెల్లబోసుకునేందుకు పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమయంలో ఈటెల రాజేందర్ అనుచరులు పెద్ద ఎత్తున ప్రెస్ క్లబ్ లోకి చొరబడి సంపత్ పై దాడి చేయడంతో పాటు మీడియా సమావేశాన్ని కవర్ చేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై దాడి చేయడం బాధాకరమని బండి రమేష్ అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే జర్నలిస్టులపై దాడి చేయటం దారుణమన్నారు. ఇలాంటి సంఘటన భవిష్యత్తులో పునరావృతం కాకుండా బాధ్యులపై కేసులు పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని బండి రమేష్ పోలీసులను కోరారు.

# మైనంపల్లి నాయకత్వంలో అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం

## కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి



**కూకట్ పల్లి, ఏప్రిల్ 2(వాయిస్ టుడే):** మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇన్చార్జిగా మైనంపల్లి ఎంపిక అభినందణీయమని, సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు దేశంలోని అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గం మల్కాజ్ గిరి నియోజకవర్గ నియమించడం అభినందనీయమని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. మైనంపల్లి హనుమంత రావు సేవా కార్యక్రమా లతో రాజకీయాలకు ప్రవేశించి పలుమార్లు శాసనసభ్యునిగా పనిచేసి ప్రత్యేకించి యువతలో మంచి ఫాలోయింగ్ ఉన్న నేత అని అభివర్ణించారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజ్ గిరి కి ఎంపీ ఎన్నికల ఇన్చార్జిగా నియమించడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. మైనంపల్లి నాయకత్వంలో మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు పథకాల హామీలతో ప్రజా ఆమోదం పొంది త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో 16 సీట్లు గెలుపొందడం ఖాయమన్నారు. అందులో అతిపెద్ద నియోజకవర్గమైన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి నియోజకవర్గం లో అత్యధిక మెజార్టీ రావడం ఖాయమని శేరి సతీష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎన్ఎంసి 24వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్



**కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (ఏప్రిల్ 02):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ బిఆర్ఎస్ కంటెస్టెడ్ కార్పొరేటర్ జి.ధనలక్ష్మి, బిఆర్ఎస్ నాయకురాలు ఎం.విజయలక్ష్మి వారి మిత్రబృందంతో 20 మంది మహిళలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై 24వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, నిజాంపేట్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణాలో మునుపెన్నడూలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, అట్టి పథకాలను ప్రతి ఒక్క మహిళకు అందేలా చూడాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొండల్ రెడ్డిని, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కొలను శ్రీనివాస్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (ఏప్రిల్ 02):** సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డిని, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి లను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వారికి శాలువా కప్పి, పుష్ప గుచ్చాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జూలకంటి లక్ష్మారెడ్డి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా ప్రభుత్వ భూముల అమ్మకాలు కొనుగోలు

- పట్టించుకోని రెవెన్యూ,పంచాయతీ రాజ్ శాఖ అధికారులు
- ఇల్లు కట్టకుండానే ఇంటి నంబరును పొంది రిజిస్ట్రేషన్లు
- రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌కీ పిర్యాదు చేసిన స్పందన కరువు
- నిర్వీర్యం చేస్తున్న POT 1977 చట్టం
- యాచారం మండలం ప్రభుత్వ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్2(వాయిస్ టుడే):** యాచారం మండల కేంద్రంలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వ భూములను గుట్టుచప్పుడు కాకుండా అమ్మడం కొనడం జరుగుతుందని యాచారం మండల ప్రభుత్వ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ అన్నారు. మొండిగౌరెల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 127లో కొంత మంది భూకబ్జాదారులు 11 ఎకరాలను కబ్జా చేయడం జరి గింది. యాచారం గ్రామానికి చెందిన ఎనిమిది ఎకరాలను అమ్మడం జరిగింది. మిగిలిన 3 ఎకరాల భూమిని 58,59 జీవో కింద నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. యాచా రం మండల కేంద్రంలోని నల్లవెల్లి గ్రామ రెవిన్యూ, మాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 567లో ఉన్నటువంటి భూమిని, గ్రామపంచాయతీ పాలకులను ప్రసన్నం చేసుకుని ఇల్లు కట్టకుండానే ఇంటినంబర్లు పొంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. ఈ విషయం అధికారులకు తెలిసి జరుగుతుందా? తెలియక జరుగుతుందా? ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన ప్రభుత్వ అధికారులే భూకబ్జాదారులకు మద్దతుగా నిలుస్తున్నారు. 1977 POT చట్టాన్ని పట్టించుకోని ప్రభుత్వ భూమి యజమానులు, కొనుగోలుదారులు, ప్రభుత్వ భూముల అమ్మకాలు, కొనుగోలు జరుగుతున్న, తెలిసి తెలియనట్లుగా ప్రభుత్వ అధికారులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల అమ్మకాలు, కొనుగోలు వ్యవహారంలో చేతివాటం చూపిస్తున్న ప్రభుత్వ అధికారులు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన ప్రజాప్రతినిధులే ప్రభుత్వ భూమినే కబ్జా చేస్తుంటే ఎవరికీ చెప్పాలో తెలియక ప్రజలు వాపోతున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయం పై రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ కీ పిర్యాదు చేసిన ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని తెలిపారు. భూ చట్టం ప్రకారం లీజ్ కు ఇచ్చిన, అమ్మిన చట్టరీత్యా నేరం అని, అమ్మిన లేదా కొనుగోలు చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ అన్నారు. ఇట్టి ప్రభుత్వ భూమి కబ్జా విషయంపై స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి, యాచారం మండలంలో జరుగుతున్న ప్రభుత్వ భూమి కొనుగోలు, అమ్మకాలపై అర్జీ ఇవ్వడం జరుగుతుందని గోడుకొండ్ల ప్రవీణ్ తెలిపారు.

# నవోదయ, సైనిక్ ఫలితాల్లో యూనివర్సల్ కోచింగ్ సెంటర్ ప్రభంజనం

- కాంపిటీషన్ ఫలితాల్లో18 సీట్లు సాధించిన విద్యార్థులు
- గ్రామీణ విద్యార్థులకు ఉత్తమ విద్య తమ లక్ష్యం
- 18 మంది విద్యార్థులు నవోదయ, సైనిక్ సీట్లు సాధించడం హర్షణీయం
- కార్పొరేట్ సెంటర్లకు దీటుగా విద్యార్థులకు కోచింగ్
- యూనివర్సల్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎ.బాలరాజ్



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్2(వాయిస్ టుడే):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన నవోదయ విద్యాలయ, ఆల్ ఇండియా సైనిక్ ఫలితాల్లో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని యూనివర్సల్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. నవోదయ విద్యాలయ, సైనిక్ విడుదల చేసిన ఫలితాల్లో తమ యూనివర్సల్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటుకున్నారని యూనివర్స ల్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎ. బాలరాజ్ తెలిపారు. యూనివర్సల్ కోచింగ్ సెంటర్ నుంచి నవోదయ విద్యాలయానికి 8మంది విద్యార్థులు, అదే విధంగా ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌కి 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా కార్పొరేట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులతో పోటీపడి మరీ సీట్లు సాధించారని సెంటర్ డైరెక్టర్ బాలరాజ్ పేర్కొన్నారు. అధ్యాపకులు అందించిన బోధనే తమ సెంటర్ విద్యార్థులకు మెరుగైన ఫలితాలను సాధించాలని అన్నారు. తమ యూనివర్సల్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఇంతటి ప్రతిభ కనబరచడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా, విద్యార్థులకు తక్కువ ఫీజుతో తమ యూనివర్సల్ కోచింగ్ సెంటర్ పనిచేస్తుందని విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేస్తూ అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూన్నామని తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తును అందించాలనే ఉద్దేశంతో విద్యాబోధన చేస్తున్నట్లు వివరించారు. కార్పొరేట్ కోచింగ్ సెంటర్లకు ధీటుగా నాణ్యమైన విద్యను తమ సెంటర్ నుంచి అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల బంగారు భవిష్యత్తును చక్కదిద్దాలనే లక్ష్యంతో తక్కువ ఫీజులతో విద్యను అందిస్తున్నామని తెలిపారు. గత నాలుగు సంవత్సరాల నుండి కోచింగ్ సెంటరును నడిపిస్తున్నామని అన్నారు. ప్రతి సంవత్సరం అత్యధిక సీట్లతో తమ యూనివర్సల్ కోచింగ్ సెంటర్ ముంధంజలో దూసుకెళ్తుందన్నారు. అనంతరం నవోదయ విద్యాలయ, ఆల్ ఇండియా సైనిక్ ఫలితాల్లో సీట్లు సాధించిన18 మంది విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం నవోదయ తరగతులు మే1 నుంచి ప్రారంభమవు తాయని తెలిపారు. వివరాలకు 630 2224279, 88854 81117 సంప్రదించాలని యూనివర్సల్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ బాలరాజ్, సెంటర్ ఉపాధ్యాయులు ధనంజయ తెలిపారు.

# ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ ఎన్నికల్లో జరుగుతున్న అవినీతిని వెలికితీసేందుకు కృషి చేయాలి

## మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి

**కూకట్ పల్లి, ఏప్రిల్ 2(వాయిస్ టుడే):** జర్నలిస్టులు ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ ఎన్నికల్లో జరుగుతున్న అవినీతిని వెలికితీసేందుకు కృషి చేయాలని మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూ- ఐజేయూ), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏ.ఎస్.రావు నగర్ లోని డాక్టర్. హెూమీ. జే.బాబా హాలులో ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఓటు హక్కు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు ఈ సదస్సుకు గౌరవ అతిథిగా తెలుగు రాష్ట్రాల ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ వి.వి.రావు, ఆత్మీయ అతిథిగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రవీందర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీద బాలరాజు, దొంతుల వెంకట్రామ్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, మేడ్చల్ జిల్లా జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.వి.రావు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తితో డాక్టర్. బీ.ఆర్. అంబేద్కర్ జర్నలిస్టుల పాత్రపై ఆనాడే తెలిపారన్నారు. ప్రజా చైతన్యంకోసం పనిచేస్తున్న ప్రతీ ఒక్కరూ గొప్పవారేనన్నారు. అందులో జర్నలిస్టుల పాత్ర ఎంతో విలువైనదన్నారు. ప్రజా స్వామ్యానికి మూలం స్వేచ్ఛను ముందుకు తీసుకెళ్లేందుకు జర్నలిస్టుల కృషి మరువలేనిదన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్య నికి మూలమైతే దాని విలువను కాపాడటంలో ప్రజలు వెనక బడిపోయారన్నారు. ఇన్ని సంవత్సరాలైనా ఎన్నికల కమిషన్ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిపే ప్రక్రియ లేకపోవడం దారుణమన్నారు. మునుగోడులో ఓటుకు 5000, 10000 వెలు ఇచ్చారని, ఎలాంటి సమాజంలో ఎన్నికలు జరుగుతున్నాయో ఊహించుకుంటే భయమేస్తుంద న్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం, అత్యధికంగా యువత ఉన్న దేశంలో ప్రజా చైతన్యం ఏమైపో యిందని ప్రశ్నించారు. ఈ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన ఓటరు చైతన్యం క్షేత్రస్థాయిలో పనిచేయడం లేదన్నారు. మానవ మనుగడలో ప్రజలని చైతన్యం చేసేంతవరకు జర్నలిజం చనిపోదని నిరంతరం ప్రజల్ని చైతన్యం చేస్తూ నిబద్ధతతో వార్తా కథనాలు రాసినప్పుడే నిజమైన జర్నలిజం మనగలుగుతుందన్నారు. ఈవీఎం మూలాలు, పోలింగ్ బూతులలో సమస్యలపై ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈవీఎమ్ లపై ఓటరుకు, అభ్యర్థికి నమ్మకం కలగాలని తెలిపారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఇచ్చిన అమలు చేసిన హామీలు, యూటర్న్ తీసుకున్న అంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేది జర్నలిస్టులు మాత్రమే అన్నారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశంలో అమెరికా కంటే ముందే భారత దేశం ప్రజలకు ఓటు హక్కును కల్పించిందన్నారు. ప్రజాస్వా మ్య స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నారని అన్నివర్గాల ప్రజల నుండి అభిప్రాయం వస్తుందన్నారు. ఈనాడు ఎన్నికల్లో నిలబడాలంటే డబ్బైనా ఉండాలి లేదా బెదిరించడం రావాలనే చందంగా మారిందన్నారు. ఇది మారాలని నిజంగా ప్రజలకు సేవ చేసే వారే ఎన్నికల్లో పోటీ చేసే రోజులు రావాలన్నారు. విలేకరులపై, జర్నలిస్టులపై దాడులేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పొందుపరచపోయినా మీడి యాది నాలుగో(ఫోర్త్ ఎస్టేట్) అంగమని అన్నారు. మీడియా ను రాజ్యాంగంలో బందించకూడదని అంబేద్కర్ అన్నారని తెలిపారు. సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్న, సమాజానికి సమాచారం అందించే వ్యక్తులే జర్నలిస్టులు అన్నారు. పత్రికకి కళ్ళు, చెవులు, విలేకరులన్నారు. ప్రజా ప్రయోజనాన్ని నెరవేర్చేది మీడియా అన్నారు. ఎన్నికల్లో ఖర్చుపై ఎన్నికల సంఘం విధించిన నిబంధనకు లోబడి ఎన్నికలు జరగడం లేదని అభ్యర్థులు ఎన్నికల్లో విజయం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. జర్నలిస్టులు రాజకీయ అవినీతి అక్రమాలపై ఏదో ఒక రూపంలో వ్యక్తం చేయలేక పోతే ప్రజాస్వామ్యానికి నష్టం చేకూరుతుందన్నారు. రాబోయే కాలంలో ఎన్నికల్లో పోటీ చేయాలంటే ధనవంతులు, డబ్బున్నవారే చేస్తారని ప్రజా సేవచేయాలనే మంచివారికి అవకాశం లేదని తెలిపారు. వాట్సాప్ 2019 ఎన్నికల్లో ఎక్కువ భాగం మిస్యూజ్ చేయడానికే పనికి వచ్చిందన్నారు. ఇప్పుడు కొత్తగా ఏఐ వ్యవస్థ వచ్చిందన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ వల్ల కొంత కాలం తర్వాత మీడియా కార్యాలయాల్లో డెస్కులు ఉండవని, యాంకర్లు, వాయిస్ ఓవర్ ఆర్టిస్టులు ఉండరని తెలిపారు. మనం కూడా టెక్నాల జీని అందిపుచ్చుకొని ముందుకు నడవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ ప్రజల విశ్వాసాన్ని చూరగొని ఎన్నికల్లో జరుగుతున్న అవినీతిని వెలికితీయాలని కోరారు. ప్రజలు, ఓటర్లు, విద్యావంతులు, ఉపాధ్యాయులు డబ్బులు తీసుకుని ఓటు వేయడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా కె.విరాహత్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కులు, సంక్షేమానికి ఆనాటి ఏపీయూడబ్ల్యూజే ఈనాటి టీయూడ బ్ల్యూజే (ఐజేయూ) దశాబ్దాలుగా పోరాడుతుందని తెలిపారు. నేడు పుట్టగొడుగుల్లా జర్నలిస్టు సంఘాలు పుట్టుకొస్తున్నా జర్నలిస్టుల కోసం పోరాడే విశ్వసనీయ సంఘం టీయూడ బ్ల్యూజే (ఐజేయూ) మాత్రమేనన్నారు. జర్నలిస్టులకు, ఇళ్ల స్థలాలు, హెల్త్ ఇన్సూరెన్స్, అక్రిడిటేషన్ కార్డులు సాధించిన ఘనత టీయూడబ్ల్యూజే(ఐజేయూ) కు దక్కుతుందన్నారు. ఒకప్పుడు తులసి వనంలో గంజాయి మొక్కల్లాగా అక్కడక్కడ నకిలీ జర్నలిస్టులు ఉండేవారని, ఇప్పుడు గంజాయిని తులసి మొక్కలలాగా జర్నలిస్టులు తయారయ్యారన్నారు. కలుపు మొక్కలనుఏరివేసి జర్నలిస్టు విలువలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీద బాలరాజు, దొంతుల వెంకట్రాంరెడ్డిలు మాట్లాడుతూ జిల్లా జర్నలిస్టులు త్వరలోనే శుభవార్త వినబోతున్నారని తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, పట్టాలు, హెల్త్ ఇన్సూరెన్స్ తదితర సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని దీనిపై ఇప్పటికే మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి విన్నవించామన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, ఎన్నికల తర్వాత శుభవార్త వింటారని అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జర్నలిస్టుల డైరీని ఆవిష్కరించారు. నూతనంగా మీడియా అకాడమీ చైర్మన్ గా భాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ రెడ్డిని మేడ్చల్ జిల్లా జర్నలిస్టులు సత్కరించుకున్నారు. అనంతరం మేడ్చల్ జిల్లా జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**కుత్బుల్లాపూర్, వాయిస్ టుడే (ఏప్రిల్ 02):** ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో అవస్థలు పడుతున్న రైతన్నలను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం ఉదయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ని సచివాలయంలోని వారి చాంబర్లో కలిసి బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పంటలను రూ. 500 బోనస్‌తో కొనుగోలు చేయాలని సీఎస్‌కు బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేలు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీఎస్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కేపీ.వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూధనా చారి, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.



# షాపూర్ నగర్ ఎంజే గార్డెన్‌లో కుత్బుల్లాపూర్ బిజెపి బూత్ స్థాయి కార్యకర్తల సమ్మేళనం




**కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (ఏప్రిల్ 02):** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం షాపూర్ నగర్ ఎంజే గార్డెన్ లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ బూత్ స్థాయి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాము గౌడ్ ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి, మల్కాజ్ గిరి బిజెపి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మాజీ ఎంపీ చాడ సురేష్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పిలుపు మేరకు నియోజకవర్గ నలుమూ లల నుండి పెద్ద ఎత్తున బిజెపి శ్రేణులు తరలివచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈటల రాజేందర్ ని భారీ మెజారిటీ తో గెలిపించి, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరిచా లని అన్నారు. ఈటల గెలిస్తే కుత్బుల్లాపూర్‌తో సహా, పార్లమెం ట్‌లోని అన్ని నియోజకవర్గాలు కేంద్ర నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. బీజేపీ గెలిచే 400 సీట్లలో మల్కాజ్గిరి సీటు తప్పకుండ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చాడ సురేష్ రెడ్డి, సీనియర్ నాయకులు డా.ఎస్.మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, పార్లమెంట్ ప్రభారీలు మధుసూదన్ రెడ్డి, వేణుగో పాల్ రెడ్డి, జగన్, సీనియర్ నాయకులు ఆర్కే శ్రీనివాస్, దుర్గా రావ్, గిరివర్ధన్ రెడ్డి, విగ్నేశ్వర్, చండి శ్రీనివాస్, నందనం దివాకర్, అర్కల సుధా, సులోచన, సరితా రావ్, జేకే శేఖర్ యాదవ్, బక్క శంకర్ రెడ్డి, సదానందం, గరిగే శేఖర్, మోతె శ్రీనివాస్, జగన్, బావిగడ్డ రవి, రాజిరెడ్డి, పీసరి కృష్ణ రెడ్డి, ఆకుల సతీష్, జనార్ధన్ రెడ్డి, మల్లేష్ యాదవ్, శివాజీ రాజు, జీవన్ రెడ్డి, ఎంబరి ఆంజనేయులు, డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, పున్నారెడ్డి, పరుష వేణు తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని నిర్వహించిన గౌడ సంఘ నాయకులు



**కరీంనగర్ ఏప్రిల్ 02(వాయిస్ టుడే):** అలుగునూర్ బ్రిడ్జిపై ఉన్న సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, అదేవిధంగా సైదాపూర్ మండలం సర్వాయిపేట గ్రామం పాపన్న గుట్టల వద్ద ఉన్న సర్వాయి పాపన్న విగ్రహానికి మినిస్టర్ పొన్నం ప్రభాకర్ గౌడ్ తో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ఈ యొక్క గుట్టలను మేము కాపాడుతామని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా చేస్తామని అదేవిధంగా నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తా మని సర్వాయి పాపన్న గుర్తులను చేరగానివ్వమని అన్నారు, సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు విరగొని పెంటయ్య గౌడ్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను తరించుకుంటూ ప్రతి ఒక్కరు సర్వాయి పాపన్న లాగా కావాలని అన్నారు... గౌడ కులం లో పుట్టి 12మంది తో మొదలై 12 వేల మంది సైన్యం తో గోల్కొండ కోటను జయించిన యోధుడు అని కొని యాడారు ఈ యొక్క కార్యక్రమంలో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కలర్ సత్తన్న గౌడ్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ కోడూరి పరుశురాం గౌడ్, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి గొడిశల రమేశ్ గౌడ్,కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, కార్పొరేటర్లు గుగ్గిళ్ళ జయశ్రీ శ్రీనివాస్ గౌడ్, ఇంటర్నేషనల్ వాకర్ అసోసియేషన్ మెంబర్ బుర్ర జగదీశ్వర్ గౌడ్, సల్ల శారద రవి, అలుగునూరు గౌడ సంఘం ప్రెసిడెంట్ పడాల రమేష్ గౌడ్, పరుచుడు బుర లక్ష్మయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి ముంజ సంపత్ గౌడ్, బుర్ర విజయ్ గౌడ్, ముంజ ప్రశాంత్ గౌడ్, సంపంగి అనీల్ కుమార్ గౌడ్, ముంజ మల్లేశ్ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, ముంజ శ్రీనివాస్ గౌడ్,సింగిల్ విండో చైర్మన్ స్వామి రెడ్డి,గౌడ సంఘం నాయకులు, బహుజన నాయకులు పాల్గొన్నరు...

## ఖబ్రస్తాన్‌ను శుభ్రం చేయించిన మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట ఏప్రిల్ 2, వాయిస్ టుడే:** ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఖబ్రస్తాన్ లో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా గత కొన్ని సంవత్సరాలుగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు అధ్వర్యంలో 11వ తేదీన రంజాన్ పండుగ పురస్కరించుకొని ఖబ్రస్తాన్ లో పెరుకోపోయిన మొక్కలను, చెత్త తొలగింపు పనులను దగ్గరుండి మున్సిపల్ సిబ్బందితో చేయించిన మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం లో ఉపవాస దీక్షలు ఉండి అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని తెలిపారు.

## కరీంనగర్ కమీషనరేట్‌లో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సేవలు ప్రారంభం..

**ఎస్.హెచ్.ఓ.గా ఏసీపీ నర్సింహా రెడ్డి నియామకం..**

**నేరాలను అరికట్టుటకు సైబర్ వారియర్స్ టీం ఏర్పాటు.**

**ప్రతీ పోలీస్ స్టేషన్‌కు ఒక సైబర్ వారియర్ కేటాయింపు.**

**కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి., ఐపీఎస్.**



**వాయిస్ టుడే... కరీంనగర్:** రోజు రోజుకీ సైబర్ నేరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో వాటికి అడ్డుకట్ట వేసి, నియంత్రిం చుటకు గాను రాష్ట్ర పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా, తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వ ర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు మరియు కమీషనరేట్ల యందు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ఇటీవల ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ కమిషనరేట్ కి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ను కేటాయించగా, కరీం నగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేశామని , మంగళవారం నుండి పూర్తి స్థాయిలో (సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్) సేవలు అందుబాటులోకి వచ్చాయని కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఐపీఎస్ ఒక ప్రకట నలో తెలిపారు. ఎస్.హెచో. ఓ.గా ఏసీపీ నర్సింహారెడ్డిని నియమించామన్నారు. భాదితులు నేరుగా వచ్చి వారి సమస్య లపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. సైబర్ నేరగాళ్లు ఎప్పటిక ప్పుడు నేరం చేసే విధానాన్ని మార్చుతూ, ఖాతాల్లో గల డబ్బు దోచుకుంటారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాల న్నారు. తెలియని వ్యక్తులకు ఫోన్ల ద్వారా వ్యక్తిగత పాస్ వర్డ్ , ఓటీపీలు అందించడం, ప్రలోభాలకు గురిచేసే లింక్‌ల ను క్లిక్ చేయడం వంటి విషయాల్లో ఎప్పటికప్పుడు చాలా అప్రమత్తంగా వుంటూ సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా జాగ్రత్త లు వహించాలన్నారు. సైబర్ క్రైమ్ గురైన భాదితులు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. బాధితులు టోల్ ఫ్రీ నెంబర్ అయిన 1930 కి కూడా కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

### సైబర్ వారియర్స్ టీం ఏర్పాటు

కమీషనరేట్ వ్యాప్తంగా ఉత్పన్నమయ్యే సైబర్ నేరాలను పోలీస్ స్టేషన్ల వారీగా ఎక్కడికక్కడ అరికట్టి నియంత్రిం చేందుకు గాను సైబర్ వారియర్స్ టీం ను ఏర్పాటు చేశామ న్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్ కు టెక్నాలజీ పై అవగాహన వున్న సిబ్బందిని గుర్తించి వారిని సైబర్ వారియర్ గా నియమించామన్నారు. క్షేత్ర స్థాయిలో భాదితులకు ఎప్పటి కప్పుడు మెరుగైన సేవలు అందించేందుకుగాను వీరిని ఏర్పాటు చేశామన్నారు. సైబర్ కేసుల్లో ఆధారాలు సేకరించి, నేరస్థులను పట్టుకోవడం, వారికి శిక్ష పడేలా చర్యలు తీసు కుని భాదితులకు న్యాయం జరిగేలా చూడడం వీరి ముఖ్య విధిగా ఉంటుందన్నారు.

## పార్టీ ఫిరాయింపులు నేర్పింది కేసీఆర్‌రే..



**ఫోన్ టాపింగులు చేసి కోట్ల రూపాయలు దోపిడి...**

**కెసిఆర్, హరీష్ రావు, కేటీఆర్‌ల మాటలు నమ్మవద్దు....**

**ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్...**

**కరీంనగర్, వాయిస్ టుడే:** ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పార్టీ ఫిరాయింపులు గతంలో నేర్పింది బి ఆర్ ఎస్ అదినేత కేసీఆర్‌రే అని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. ఆయన మంగళవారం ప్రెస్ భవన్ లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల్ని మోసం చేసిన కెసిఆర్ హరీష్ రావు కేటీఆర్‌లు ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లో మళ్ళీ తిరుగుతు న్నారని ఆయన ప్రశ్నించారు. ధరణి గోల్ మాల్ వల్ల ఒక లక్ష కోట్ల భూములు గోల్ మాల్ అయినాయని తెలిపారు. ఒక ప్రాంతంలోని 20,000 కోట్ల విలువ చేసి భూములు కేటీఆర్ ఇండస్ట్రీలోకి వెళ్లిపోయాయి అని ఆరోపించారు. ధరణి సమస్యల మూలంగా రైతులు ఇంకా చనిపోతూనే ఉన్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు ఇంకా కేసీఆర్ హరీష్ రావు కేటీఆర్ ల మాయమాటల్లో పడొద్దు అన్నారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు, జర్నలిస్టులు , సినిమా హీరోలు ,హీరోయిన్ల, ప్రముఖ నాయకుల ఫోన్లు టాపింగ్ చేసి బ్లాక్ మేలింగులకు పాటుపడి బి ఆర్ ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలను దోపిడీ చేసిందని ఆరోపించారు. టిఆర్ఎస్ నుంచి వెళ్ళిపోతున్న వాళ్లను కుక్కలని కెసిఆర్ మాట్లాడడం చూస్తే నే మనకు తెలుస్తుంది అన్నారు. ఆ పార్టీలో ఉన్న వాళ్ళందరినీ వాళ్లు మనుషుల్లాగా చూడకుండా కుక్కల్లాగాని చూశారు అనేది మనకు అర్థమవుతుందని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ కు వెళ్లారు కనుక మనుషుల్లాగా మారతారు ఏమో అని అన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ టి అర్ ఎస్ పార్టీ లోనే ఉంటాను అని ధైర్యంగా చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీల మూలంగా విద్యార్థులు రోడ్డున పడ్డారన్నారు. కేటీఆర్ దావూద్ ఇబ్రహీం తమ్ముడు లాగా మాట్లాడుతు న్నారని ఆరోపించారు. కాలేశ్వరం ప్రాజెక్టు టిఆర్ఎస్ పాలనలోని పిల్లర్లు కుంగి దెబ్బతిన్నది నిజం కాదా అని అన్నారు. మరి అలాంటిది ఇప్పటి కరువుకు కాంగ్రెస్ కార ణమని బిఆర్ఎస్ నేతలు ఆరోపించడంలో అర్థం లేదన్నారు. ప్రజామిత్ర ఇండియా కూటమికే మద్దతు తెలుపుతుంద న్నారు. దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వం, తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం అవసరమన్నారు. కరీంనగర్ పార్లమెంటు టికెట్ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఆలోచించి మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డికి ఇస్తే బాగుంటుందని కాంగ్రెస్ హై కమాండ్ కు ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ తరపున కొరివి వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో చంద్రయ్య సిరి శ్రీధర్, బాపురెడ్డి, నరసయ్య , గజ్జల రవిలు పాల్గొన్నారు.

## 59 వేల నగదు పట్టివేత




**బోయినపల్లి ఏప్రిల్ 2, వాయిస్ టుడే ప్రతినిధి:** బోయినపల్లి మండలం కొదురుపాక చెక్ పోస్ట్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న 59 వేల రూపాయల నగదును పట్టుకున్నట్టు ఎస్ ఎస్ టి టీం ఇన్చార్జి ఏఈ గోవింద తెలిపారు. కొదురుపాక వద్ద వాహనాలు తనికీ చేస్తూండగా నారాయణఖేడ్ చెందిన దొడ్ల సాయిలు, కరీంనగర్ నుండి వేములవాడ వైపు వెళ్తుండగా పట్టుకున్నటు తెలిపారు నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేసి ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ కి అప్పగించినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున 50 వేల కంటే ఎక్కువ నగదు బంగారం తీసుకెళ్లేవారు ఆధారాలు వెంటపెట్టుకోవాలని సూచించారు. ఆయన వెంట జగన్ రావు చంద్రయ్య లు ఉన్నారు.

## నూతన పంచాంగ ఆవిష్కరణ



**చందుర్తి వాయిస్ టుడే ప్రతినిధి ఏప్రిల్ 2:** రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లా కేంద్రంలో మంగళవారం ధూప, దీప నైవేద్య జిల్లా అర్చక సంఘం ఆధ్వర్యంలో నూతన 2024 పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 నూతన పంచాంగాన్ని సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. శుభ సమయం, వర్జ్యం, రాహు కాలం, దుర్ముహూర్తం వంటి వివరాలు తెలుసుకోవచ్చు. హిందూ పంచాంగం ప్రకారం తిథి తెలుసుకోవడానికి హిందూ తెలుగు పంచాంగం ప్రకారం పంచాంగంలో 5 ముఖ్యమైన అంశాలు ఉంటాయి. అవి తిథి, వారం, నక్షత్రం, కరణం, యోగం. బవ తదితర ఉంటాయి. 2024 సం వత్సరాలు పంచాంగ శ్రవణ ఇందులో ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ గ్రామాలకు చెందిన అర్చకులు పాల్గొన్నారు.

## కోతకొచ్చిన పంట కోసం రైతుల కష్టాలు

**బిట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా.. బిట్యాంకర్ల నీటికి 50 వేల రూపాయలు**



**చందుర్తి వాయిస్ టుడే ప్రతినిధి ఏప్రిల్ 2:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన కంట్టే రెడ్డి రైతు ట్యాంకర్లతో తన పొలానికి నీళ్లు పట్టే దుస్థితి ఏర్పడింది. బోర్లు బావులు ఉన్న నీరు అడుగంటడంతో వరి పొట్ట దశకు రావడంతో పంటను కాపాడడం కొరకు ట్యాంకర్లతో నీటిని పొలానికి అందిస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 20 ట్యాంకర్లను నీటిని అందించామని ఒక్కొక్క ట్యాంకర్ కు 600 రూపాయల చొప్పున చెల్లించామని పూర్తిగా కోతకు వచ్చేసరికి ఇంకా 30 ట్యాంకర్ల నీరు అవసరం పడుతుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తను వేసిన నాలుగు ఎకరాల పొలాన్ని కాపాడడం కొరకు పెట్టిన పెట్టుబడి పొందడం కొరకు మాత్రమే దాదాపుగా నలభై నుండి 50 వేల రూపాయలు ఖర్చు చేసి వరికి నీళ్లు అందిస్తున్నామని తన గోడు వెలుబుచ్చుకున్నాడు. ఫిబ్రవరి మార్చిలో కాలువల ద్వారా నీటిని అందిస్తే భూగర్భ జలాలు పెరిగి కొంతవరకు వరి పొలాలకు ఉపశమనం ఉండెదని అన్నాడు. ఇంత చేసినప్పటికీ కోతకు వచ్చేసరికి వడగళ్ల వానలు పడినట్టు అయితే రైతుల బాధ వర్ణనాతీతం అని అన్నాడు.

## ఎక్సైజ్ సీఐ నీ సన్మానించిన ఒగ్గు బాలరాజు యాదవ్, నేవూరి శ్రీనివాస్ రెడ్డి..



**రాజన్న సిరిసిల్ల జిల్లా వాయిస్ టుడే ప్రతినిధి ఏప్రిల్ 2:** నూతనంగా విధుల్లో చేరిన ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను మంగళవారం ఎక్సైజ్ కార్యాలయం లో ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ,కాంగ్రెస్ నాయకులు ఒగ్గు బాలరాజు యాదవ్,జిల్లా రెడ్డి సంఘం ఎక్జిక్యూ టివ్ మెంబర్ నేవూరీ శ్రీనివాస్ రెడ్డి కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండల ఎక్సైజ్ సీఐగా పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ అన్నారు.

## వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: తహశీల్దార్ పుష్ప లత**



**బోయినపల్లి ఏప్రిల్ 2, వాయిస్ టుడే ప్రతినిధి:** బోయినపల్లి మండలం కోరేం లో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తహసిల్దార్ పుష్పలత. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు ధళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రములలో మాత్రమే వరి ధాన్యం విక్రయించుకోవాలని రైతులను కోరారు. ప్రతి కొనుగోలు కేంద్రములలో చలవ పందిల్లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు , త్రాగు నీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అలాగే ఈ ఎండాకాలంలో వేడి గాలులు తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతి రైతు తగు జాగ్రతలు తీసుకొనేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో రైతులు ఉన్నారు

వాయిస్ టుడే
హైదరాబాద్
బుధవారం, ఏప్రిల్ 03, 2024



# తప్పిపోయిన వృద్ధుడిని డే కేర్ సెంటర్‌లో అప్పగింత

**రాజన్న సిరిసిల్ల జిల్లా వాయిస్ టుడే ప్రతినిధి ఏప్రిల్ 2:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట కు తప్పిపోయి వచ్చిన కొక్కుల నర్సయ్య (83)అనే వృద్ధుడిని ఎల్లారెడ్డి పేట మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ నాయకులు ఒగ్గు బాలరాజు యాదవ్ కు బస్ స్టాండ్ ప్రాంత వాసులు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన ఒగ్గు బాల రాజు యాదవ్ డే కేర్ సెంటర్ ఇంచార్జీ మమత కు సమాచారం అందించారు. వెం టనే వృద్ధుడిని డే కేర్ సెంటర్‌లో చేర్పించడం జరిగింది.వృద్ధుడిని తన కుటుంబ వివ రాలు అడిగితే ఓగులాపూర్ నివాసుడనని సమాధానం చెబుతున్నారు. వృద్ధుడికి చెవు లు సరిగా వినబడడం లేదు.ఒగ్గు బాలరాజు యాదవ్ వెంట బిజెపి నాయకులు పారి పెల్లి సంజీవ రెడ్డి,సద్ది జ్యోతి,సద్ది నాగరాణి ఉన్నారు. డే కేర్ సెంటర్ లో చేర్పిం చ డానికి సహకరించిన డే కేర్ సెంటర్ ఇంచార్జీ మమత కు ఒగ్గు బాలరాజు యాదవ్, సంజీవ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు వృద్ధుడి సమాచారం తెలిసిన వారు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం చెరవేయాలని లేదా సమాచారం తెలిసిన వారు ఒగ్గు బాలరాజు యాదవ్ సెల్ నంబర్‌కు పోన్ చేయాలని 9059519691 కోరారు.

# శ్రీ కనకదుర్గ అమ్మవారి చతుర్ధ 4వ మహెూత్సవాలు ఆహ్వానం



**శ్రీ కనకదుర్గ అమ్మవారి (చతుర్ధ) 4వ జాతర మహెూత్సవాలకు బూర్గంపాడు మండల జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత కి ఆహ్వాన పత్రికను అందజేసిన... శ్రీ కనకదుర్గ దేవాలయ సేవా సమితి ఆలయ కమిటీ నిర్వాహకులు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. బూర్గంపాడు, వాయిస్ టుడే:** ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో మండల జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత ని మంగళవారం నాడు శ్రీ కనకదుర్గ దేవాలయ సేవాసమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సారపాక సాకేతపురి గాంధీనగర్ ఏరియా లో ఈనెల 8వ తేదీ నుండి 10 తేదీ వరకు మూడు రోజులపాటు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది మహెూత్సవాల సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి చతుర్ధ 4వ మహెూత్సవాలు జరగనున్న నేపథ్యంలో రావాలంటూ ఆహ్వాన పత్రికను శ్రీ కనకదుర్గ దేవాలయ సేవా సమితి వారు అందజేయడం జరిగింది..., ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వెల్ది శివసాయి కుమార్ శర్మ , ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సిలివేరు వీరాంజనేయులు, కార్యవర్గ సభ్యులు భూక్య రమేష్, సత్య సాయి మరియు ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు...

# ఏఎస్పీ సార్... గెట్ వెల్ సూన్

### క్రాంతి విద్యాలయం చిన్నారులు



**భద్రాచలం,ఏప్రిల్ 2:** ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో డ్యూటీ నిర్వహిస్తుండగా భద్రాచలం ఏ.ఎస్.పి పరితోష్ పంకజ్ కు గాయాలు అయిన విషయం విధితమే.ఈ క్రమంలో క్రాంతి విద్యాలయంలో చదువుతున్న యు.కే.జి విద్యార్థులు పాటశాల డైరెక్టర్ సోమరౌతు శ్రీనివాసరావు అధ్వర్యంలో మంగళవారం ఏ.ఎస్.పి ఆఫీస్ కి వెళ్లి ఏ.ఎస్.పి పరితోష్ పంకజ్ కు గెట్ వెల్ సూన్ సర్ అంటూ పలకరించారు. వివిధ రకాల ప్లే కార్డులతో వారి గౌరవాన్ని తెలిపారు. చిన్నారులు పుష్పగుచ్చాలను ఏ.ఎస్.పి కి అందించడం జరిగింది. సమయ భావంలో ఉన్నప్పటికీ, ఏ.ఎస్.పి చిన్నారులు వచ్చారని తెలిసి, సమయాన్ని కేటాయించారు. ప్రతి చిన్నారిని పలకరించి ఏ.ఎస్.పి పంకజ్ పరితోష్ వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్, క్రాంతి విద్యాలయం పరిపాలన డీన్ హేమ శిల్ప,ఫ్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు సాంబలక్ష్మి, సౌమ్య, అడ్మిన్ అసిస్టెంట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# భాధ్యతయుతంగా విధులు నిర్వహించాలి

### FST, SST టీంలో హాజరు కానీ వారిపై చర్యలు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు



**సూర్యాపేట, ఏప్రిల్2 (వాయిస్ టుడే ప్రతినిధి):** జిల్లాలోని FST, SST కేంద్రాలను పరిశీలిం చటానికి అలాగే వాస్తవ పరిస్థితిని జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక అందచేయుటకు ముగ్గురు జిల్లా స్థాయి అధికారులు నియమించటం జరిగిందని, కేంద్రాల్లో ఏమైనా లోపాలను గుర్తిస్తే అక్కడే ఆ కేంద్రంలో ఉన్న బృంద ప్రతినిధికి నివృత్తి కై తెలియజేయటం జరు గుతుందని జిల్లా కలెక్టర్ వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా నియమించిన అధికారులు FST, SST కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు చేసి నివేదికలను అదనపు కలెక్టర్, RDO, DSPలకు అందచేయాలని అలాగే మూడు విడతలలో పనిచేస్తున్న అధికారులు ఎవరైనా హాజరు కాకపోయినా,సరైన రీతిలో తనిఖీలు చేపట్టకపోయినా ఎన్నికల చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# వడదెబ్బ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోండి

## బాధితులకు సత్వరమే వైద్య సేవలు అందించాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ ఏప్రిల్ 02(వాయిస్ టుడే):** రోజురోజుకు ఉష్ణోగ్ర తలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుం డా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులకు సూచించారు. ఎవరైనా వడదెబ్బ బారిన పడితే వెంటనే హాస్పిటల్ కు తరలించి వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని బస్తీ దవాఖానను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడికి వైద్య సేవల కోసం వచ్చిన మహిళలతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందు తున్నాయని అడిగి తెలుసుకున్నారు. మందులు ఇస్తున్నారా.. పోషకాహారం పై అవగాహన కల్పిస్తున్నారా.. అని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మం దులు అందుబాటులో ఉంచాలని సూచించారు. డాక్టర్ రూ మ్, ల్యాబ్, వివిధ వార్డులను పరిశీలించారు. రోజు పేషెంట్లు ఎంతమంది వస్తారు.. వారికి అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందినీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అం దుబాటులో ఉంటూ అత్యుత్తమ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య పరీక్షల రిపోర్టుకు అవసరమైన ప్రింటర్, కంప్యూటర్ ను అందిస్తానని, ఈ మేరకు ప్రతిపాదనలు పంపించాలని జిల్లా వైద్యాధికారినీ ఆదేశించారు. వీటిని త్వరగా ఇప్పించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. వైద్య సేవలు అందించడంలో సిబ్బంది ఎక్కడ నిర్లక్ష్యంగా వ్యవహరిం చవద్దని తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు హాస్పిటల్ వచ్చే వారికి అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, డిప్యూటీ వైద్యాధికారి జువేరియా, పీఓ ఎం హెచ్ ఎన్ సన జువేరియా, వైద్యాధికారులు లావణ్య, సాహితీ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అతి త్వరలో బీజేపీ ప్రజా మేనిఫెస్టో

**ప్రజల నుండే నేరుగా అభిప్రాయాలను సేకరించి మేనిఫెస్టో రూపొందిస్తున్నాం**

**రైతులతో సమావేశమైన బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్**



**కరీంనగర్ ఏప్రిల్ 02(వాయిస్ టుడే):** సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించి అతి త్వరలో బీజేపీ పక్షాన ప్రజా మేనిఫెస్టోను విడుదల చేస్తామని మేనిఫెస్టో కమిటీ సభ్యులు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి కుటుంబ పార్టీల మాదిరిగా నాలుగు గోడల మధ్య మేనిఫెస్టోను రూపొందించబోమని ప్రజల నుండి నేరుగా అభిప్రాయాలను సేకరించిన తరువాతే ప్రజాకర్షక మేనిఫెస్టోను రూపొందించి విడుదల చేస్తామన్నారు. రైతన్నలారా పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా అతి త్వరలో మేనిఫెస్టోను విడుదల చేయబోతు న్నాం. వ్యవసాయ రంగానికి సంబంధించి ఏ అంశాలను మేనిఫెస్టోలో చేర్చాలనే అంశంపై నేరుగా రైతుల నుండి అభిప్రాయాలను సేకరిస్తున్నాం మీరేం కోరుకుంటున్నారో మీ అభిప్రాయాలను చెప్పండి అంటూ కరీంనగర్ జిల్లా రైతులతో బీజేపీ జిల్లా రైతాంగాన్ని కోరారు. ఈరోజు మధ్యాహ్నం ఎంపీ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సమావే శానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ తమ అభిప్రాయాలు వెల్లడించారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోవడం వల్ల వ్యవసాయం చేయడం చాలా ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్. కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు యువత, రైతుల అభిప్రాయాలను సేకరిం చామని, ఈనెల 5లోపు కార్మికులు, మహిళలు సహా అన్నివ ర్గాల ప్రజల అభిప్రాయాల సేకరణను పూర్తి చేస్తామని తెలిపారు.



# సొంత గూటికి కాంగ్రెస్ నేతలు

**తొర్రూర్ ఏప్రిల్ 02 వాయిస్ టూడే:** పాలకుర్తి ఎమ్మెల్యే యశేశ్విని రెడ్డి పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గాంధీభవన్‌లో BRS పార్టీ నుండి మన మాజీ గ్రామ సర్పంచ్ వల్లపు శోభ యాకయ్య మరియు BRS పార్టీ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున సొంత గూడు ఐనా కాంగ్రెస్ పార్టీలోకి చేరడం జరిగింది. పాలకుర్తి ఎమ్మెల్యే యశేశ్విని రెడ్డి పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

# దుర్గమ్మ తల్లి దర్శించుకున్న ఎమ్మెల్యే దొంతి




**నర్సంపేట(వాయిస్ టుడే):** నెక్కొండ మండల వెంకట్ తండ మరియు అప్పల్ రావుపేట గ్రామం ఆవుసుల తండ దుర్గమ్మ గుడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి నర్సంపేట టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు పెండం రామానంద్, నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, నర్సంపేట మాజీ మార్కెట్ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ , ఒబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్ల శ్రీపాల్ రెడ్డి, ఈదునూరి సాయి కృష్ణ, రావుల మహిపాల్ రెడ్డి ,ఇల్లా రవి ,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గై లక్ష్మణ్, పెద్ద కోర్పోల్ MPTC కర్ర సుకన్య చెన్నారెడ్డి, వరంగల్ జిల్లా యూత్ మరియు NSUI అధ్యక్షులు బండి శివకుమార్, బోడ శ్రీకాంత్ నాయక్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని రాజేందర్, వెంకట్ తండా: మరియు అప్పల్ రావుపేట్ గ్రామ నాయకులు ఉడుగుల అశోక్ వీరు సంతోష్ వెంకటేశ్వర్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిప్పని రమేష్, భీమన్న నాయక్, మాజీ ఎంపీటీసీ మచ్చ వీరన్న, గ్రామ నాయకులు జంపాల శీను, బొడ్డుపల్లి యాదగిరి, దయ్యాల ఐలయ్య, పడాలి రవి, మండే కుమారస్వామి, కమలాకర్, గ్రామ నాయకులు పాల్గొన్నారు

# ఖమ్మం ఎంపీ సీటు ఈసారి బీసీలకే..

**ఆశావహుల అర్హతలన్నింటినీ పరిశీలించిన ఏఐసీసీ**

**ఖమ్మం ఎంపీ అభ్యర్థిత్వంపై నేడో, రేపో, తుది నిర్ణయం**



**భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఏప్రిల్2:** గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఉత్కంఠ నెలకొన్న ఖమ్మం ఎంపీ అభ్యర్థి ఖరారు ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. రాష్ట్రంలోనే చైతన్యవంతమైన ఓటర్లు ఉన్న ఖమ్మం జిల్లాలో ఎంపీ సీటు కోసం మహామహులు పోటీపడుతున్నారు. తమ వారికి టికెట్ ఎలాగైనా ఇప్పించుకోవాలని జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఈ సీటు విషయంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తన భార్య నందిని కోసం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన సోదరుడు ప్రసాద్ రెడ్డి కోసం, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుమారుడి కోసం పోటీపడుతున్నారు. అయితే.. తమకు అందిన అభ్యర్థుల జాబితాను పరిశీలించిన కాంగ్రెస్ అధిష్టానానికి.. ఖమ్మం అభ్యర్థి ఎంపిక కొంత ఇబ్బందికరంగా మారినా. అంతిమంగా సామాజిక సమీకరణల ఆధారంగా టిక్కెట్ కేటాయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ముగ్గురు మంత్రులలో ఏ ఒక్క కుటుంబానికి సీటు కేటాయించినా అంతర్గతంగా పార్టీ ప్రయోజనాలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని భావించిన అధిష్టానం, ప్రత్యామ్నాయ అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. రాజకీయంగా ఇప్పటికే మంత్రి పదవులను అనుభవిస్తున్న వారి కుటుంబాలకు ఎంపీ టిక్కెట్ కేటాయించడం వల్ల సాధారణ ఓటర్లకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఏఐసీసీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా సామాజిక సమీకరణల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఖమ్మం ఎంపీ అభ్యర్థి ఎంపిక విషయంలో ఇంతకాలం ఆలస్యం కావడానికి కూడా ఇదే కారణమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**బీసీకిస్తే పార్టీకి, ప్రభుత్వానికి మేలు...**

దాదాపు గత నాలుగు దశాబ్ధాల కాలంగా ఖమ్మం ఎంపీ స్థానంతోపాటు ఆ పరిధిలో ఉన్న అసెంబ్లీ స్థానాలలో సైతం ఓసీలకు, ఎస్సీలకు, ఎస్టీలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. అయితే..ప్రాతినిధ్యం విషయంలో తమకు ఇంత వరకూ ఏ మాత్రం న్యాయం జరగలేదన్న తీవ్ర అసంతృప్తి బీసీల్లో నెలకొంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 16 లక్షలకు పైగా ఓటర్లు ఉండగా.. అందులో దాదాపు 9 లక్షలు బీసీ ఓటర్లున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేసుకున్న బీసీ అభ్యర్థుల పేర్లను అధిష్టానం క్షుణ్ణంగా పరిశీలించినట్టు తెలిసింది. అందులో యాదవ సామాజిక వర్గానికి చెందిన నాగ సీతారాములు పేరును పలువురు సీనియర్ నేతలు సూచించినట్టు సమాచారం. ఖమ్మం ఎంపీ నియోజకవర్గ పరిధిలో మూడున్నర లక్షలకుపైగా యాదవ ఓటర్లుండడంతోపాటు వివాదరహితడని, పార్టీని అంటిపెట్టుకుని పని చేస్తున్నాడని, అతనిపై అధిష్టానం సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. రేపు జరగనున్న సీఈసీ సమావేశంలో అతని అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయనున్నట్లు ఏఐసీసీ వర్గాల ద్వారా తెలిసింది.

# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితుల అరెస్ట్

**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి ఏప్రిల్ 2 2024 (వాయిస్ టుడే):** గత కొద్ది కాలంగా బెల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో బెల్లంపల్లి పట్టణానికి చెందిన నలుగురు యువ కులు లింగాల యశ్వంత్, తోట మనిదీప్ అనే వారు చెడు అలవాట్లకి అలవాటు పడి గత కొద్ది రోజులుగా మహారాష్ట్ర లోని చంద్రపూర్ పట్టనంలో పెద్ద ఎత్తున గంజాయి తక్కువ ధరకి కొని తీసుకు వచ్చి బెల్లంపల్లి లోని యువతకి ఎక్కువ ధరకి అమ్ముకుని లాభాన్ని పొందుతూ జీవితాన్ని విలాసవంతంగా గడపడానికి అలవాటు పడరు. అదే క్రమంలో తేది 24.03.2024 నాడు చంద్రపూర్ మహారాష్ట్ర కి కలసి వెళ్లి గంజాయి కొని తీసుకుని వచ్చి యశ్వంత్, మనిదీప్ లు 1100 గ్రాముల గంజాయి అమ్మడానికి కొత్త బస్ స్టాండ్ చేరువలో ఒక కవర్ పట్టుకుని రాగ పెట్రోలింగ్ చేసే సిబ్బంది యస్. ఐ రమేష్ నిందితులని పట్టుకున్నారు. వారి పై కేసు నమోద్ చేసి రిమాండ్ కి తరలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల డీసీపీ మాట్లాడుతూ... యువత చెడు వ్యసనాలకి ఆకర్షితులు కాకుండా సత్ప్రవర్తన కలిగి బంగారు భవిత కోసం శ్రమించాలని, సంఘవిద్రోహ చర్యల పై, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలిసు వారి నిఘా ఎల్లప్పుడూ ఉంటుంది. చట్ట వ్యతిరేఖ పనులు చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు అని చట్ట పరంగా కఠిన చెర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించినారు.